


## నేడు పంచాయతీల్లో గ్రామసభలు

### - ప్రణాళికలు సిద్ధం చేయండి :కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, ఆగస్టు 22 ప్రభాతవార్త:
జిల్లాలోని 700 గ్రామ పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు విజయవంతంగా నిర్వహించాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ పిలుపునిచ్చారు. కలెక్టరేట్ నుండి ఆయన గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆర్డీఓలు, ఎంపిడిఓలు, ఎంపిడిఓలు, తహసిల్దార్లు, ప్రత్యేక అధికారులతో గ్రామ సభల నిర్వహణపై సమీక్షించారు. సమీక్షలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి, గ్రామాల ముఖచిత్రం మారేలా అభివృద్ధి ప్రణాళికలు రూపకల్పన జరుగాలన్నారు. ప్రజాస్వామ్య పద్దతిలో గ్రామసభలు నిర్వహించి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. మహాత్మాగాంధీ కన్న కలలు గ్రామ స్వరాజ్యం స్థాపించడానికి గ్రామాల్లో అభివృద్ధి పటిష్టంగా జరుగాలన్నారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామంలో మౌళిక సదుపాయాలు కల్పించాలన్న ఉద్దేశంతో జాబ్ కార్డు కల్గిన వారికి వంద రోజుల పని దినాలు కల్పించడంపై కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

## నేడు చెంగాళమ్మ దేవస్థానంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం

సూళ్లూరుపేట, ఆగస్టు 22 ప్రభాతవార్త
సూళ్లూరుపేటలోని శ్రీచెంగాళమాతా పరమేశ్వరి దేవస్థానంలో శుక్రవారం సామూహిక వరలక్ష్మీ వ్రతాన్ని నిర్వహించ నున్నారు. ఈ కార్యక్రమానికి చిట్టేటి పెరుమాళ్లు, భాస్క రాచారి, దర్శి శ్రీనివాసులు, కర్లపూడి సురేష్‌బాబు ఉభయ కర్తలుగా వ్యవహించనున్నారు. ఉదయం నుంచి ఈ సామూహిక వరలక్ష్మీ వ్రతం ప్రారంభమవుతుందని దేవస్థానం ఇన్‌ఛార్జ్ కార్యనిర్వహణాధికారి తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.





## అక్రమ ఇసుక రవాణా కట్టడికి చర్యలు

- నిర్ధేశించిన ధర కంటే ఎక్కువ వసూలు చేస్తే చర్యలు
- జిల్లాలో అందుబాటులో 1.84 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక
- ప్రభుత్వానికి ఇసుక విక్రయాల ద్వారా ఇప్పటి వరకు రూ.91 లక్షలు ఆదాయం
- ఇప్పటి వరకు 74 వాహనాలు సీజ్ - కలెక్టర్ సుమిత్‌కుమార్

చిత్తూరు, ఆగస్టు 22 ప్రభాతవార్త:
జిల్లాలో ఇసుక అక్రమ రవాణా జరుగకుండా పూర్తి స్థాయిలో కట్టడికి చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ సుమిత్‌కుమార్ పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని సమావేశభవనంలో గురువారం కలెక్టర్ సుమిత్‌కుమార్ ఎస్పీ మణికంఠ చందోలుతో కలిసి ఇసుక విక్రయాలపై విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. ఈ సమావేశంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ మాట్లాడుతూ ప్రజలకు తక్కువ ధరకు ఇసుక అందించడానికి చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఇందుకు సంబంధించి రవాణా శాఖ, భూగర్భ గనులు సంబంధిత శాఖల అధికారులతో ఏర్పాటైన కమిటీ స్థిరమైన రవాణా ఛార్జీలతో కలిపి ఇసుకను అందించడానికి చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అలాగే ఇసుక అక్రమ రవాణ అడ్డుకట్ట వేయడానికి ఇటు వినియోగదారులు, అటు రవాణా శాఖ అధికారులు, ప్రజలు, పోలీసులు, మీడియా నుండి సమాచారంను సేకరిస్తున్నామన్నారు. అలాగే ప్రతి పదిహేను రోజులకు ఒకసారి శాస్త్రీయంగా సర్వే చేస్తున్నామన్నారు. జిల్లాలోని మూడు ఇసుక డిపోల్లో ప్రస్తుతం 1,84,519 మెట్రిక్ టన్నుల ఇసుక ప్రస్తుతం అందుబాటులో వుందన్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 58 వేల మెట్రిక్ టన్నుల ఇసుక విక్రయాల ద్వారా జిల్లాకు 91 లక్షల రూపాయలు ఆదాయం సమకూరిందన్నారు. ఇసుక అక్రమ రవాణా కట్టడిలో భాగంగా జిల్లా వ్యాప్తంగా ఇప్పటి వరకు 74 వాహనాలను సీజ్ చేయడం జరిగిందన్నారు. సీజ్ చేసిన ప్రతి వాహనం నుండి 4 నుండి 5 టన్నుల ఇసుకను తీసుకోవడం జరిగిందని, అలాగే 3.50 లక్షల రూపాయల మేరకు అపరాధ రుసుం విధించడం జరిగిందన్నారు. అలాగే ఇసుక స్టాక్ పాయింట్ల వద్ద నిరంతరం సిసి కెమెరాలను ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నామన్నారు. ఇసుక తరలించే వాహనదారులు వినియోగదారులకు ప్రభుత్వం నిర్ణయించిన మేరకు ధరలకు విక్రయించాలన్నారు. గత 45 రోజుల నుండి జిఎస్‌టి, సీనరేజ్, జెసిబి, లోడింగ్ ఛార్జీలు, ఎన్విరాన్‌మెంట్ టాక్స్ కలిపి ఒక మెట్రిక్ టన్ను ఇసుకకు రూ.155 చెల్లించాల్సి వుంటుందన్నారు. జిల్లాలో ప్రస్తుతం 2 ఇసుక డిపోల నుండి ఇసుక అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. ఎస్పీ మణికంఠ చందోలుతో కలిసి ఇసుక డిపోల్లో ఇసుక అమ్మకం విధానంను పర్యవేక్షిస్తున్నామన్నారు. ఇసుక స్టాక్ పాయింట్ నుండి 10 కిమీ లోపు దూరం వుంటే రూ.1,200, 10–15 కిమీ దూరం వుంటే రూ.1,400, 15–20 కిమీ దూరం వుంటే రూ.1,600, 20–25 కిమీ దూరం వుంటే 1,800, 25–30 కిమీ దూరం వుంటే రూ.2 వేలు రవాణాఛార్జీలు నిర్ణయించడం జరిగిందన్నారు. గరిష్టంగా రూ 2,700లకు 5 మెట్రిక్ టన్నుల ఇసుక సమకూర్చడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. ఇసుక రవాణాకు సంబంధించి ఎక్కడైనా అధిక ధరలు వసూలు చేస్తే చర్యలు తప్పవని స్పష్టం చేశారు. ప్రస్తుతం ప్రతి రోజు జిల్లాలోని రెండు ఇసుక స్టాక్ పాయింట్ల నుండి 1,500 మెట్రిక్ టన్నుల ఇసుక రవాణా అవుతుందన్నారు. జిల్లాలోని రెండు ఇసుక స్టాక్ పాయింట్లలో మరో 80 రోజుల వరకు విక్రయించడానికి అవసరమైన ఇసుక వుందన్నారు. జిల్లాలో సెప్టెంబర్ 21 నుండి ఇసుక విక్రయాలు ఆన్‌లైన్ ద్వారా నిర్వహించడం జరుగుతుందన్నారు. గ్రామ సచివాలయంలో ఇసుక కొనుగోలు చేసే వినియోగదారులు ఛార్జీలు చెల్లించి రసీదు తీసుకుని స్టాక్ పాయింట్ల వద్దకు వెళ్ళి ఇసుక లోడ్ చేసుకుని రావచ్చునన్నారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ హిమవంశీ, భూగర్భ గనుల శాఖ డిడి ప్రసాద్, డిఆర్ఓ చిన్నయ్య తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా స్వర్ణ రథోత్సవం



కాణిపాకం, ఆగస్టు 22 ప్రభాతవార్త:
కాణిపాకం వరసిద్ది వినాయకస్వామివారి దేవస్థానంలో గురువారం రాత్రి సిద్ది బుద్ది సమేతుడైన గణనాధుడు సర్వాలంకృతుడై స్వర్ణరథంపై అధిరోహించి ఆలయ మాడా వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించారు. ప్రతి నెలా పౌర్ణమి అనంతరం సంకటహర చతుర్థి రోజున స్వామివారికి స్వర్ణరథోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు స్థానిక ఆస్థాన మండపంలో స్వామివారికి ఉదయం, సాయంత్రం వేళల్లో రెండు దఫాలుగా సంకటహర చతుర్థి వ్రతంను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అలాగే రాత్రి స్వామివారికి స్వర్ణ రథోత్సవం నిర్వహించారు. అనంతరం భక్తుల గణేష్ నామస్మరణలు, మంగళ వాయిద్యాల నడుమ ఆలయ మాడా వీధుల్లో స్వామి, అమ్మవార్లను ఘనంగా ఊరేగించారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.వాణి, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్‌లు వాసు,కోదండపాణి, అర్చకులు,వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

### విద్యుత్ శాఖ పరిధిలో అభివృద్ధి పనులకు

## రూ.740కోట్లతో ప్రతిపాదనలు

### - విద్యుత్ లైన్లు.. ట్రాన్స్‌ఫార్మర్లు.. సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు విజన్ డాక్యుమెంట్ !!



కుప్పం, ఆగస్టు 22 ప్రభాతవార్త
సిఎం చంద్రబాబు నాయుడు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గంలో విద్యుత్ శాఖ తరపున చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు దాదాపు 740కోట్ల రూపాయల అంచనా వ్యయంతో అధికారులు అంచనాలు సిద్ధం చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించినట్లు తెలిసింది. ప్రధానంగా కుప్పం నియోజకవర్గంలో రైతులు, ప్రజలకు కుప్పం గ్రామీణ విద్యుత్ సహకార సంఘం (రెస్కో) ద్వారా విద్యుత్ సేవలు అందుతున్నాయి. రెస్కో పరిధిలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ఎపిఎస్‌పిడిసిఎల్, ట్రాన్స్‌కో పరిధిలో చేపట్టే అభివృద్ధి పనులకు సంబంధించి ఈ ప్రతిపాదనలు సిద్ధం చేశారని సమాచారం. ప్రధానంగా రైతులకు వ్యవసాయ రంగానికి తొమ్మిదిగంటలపాటు నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించడంతో పాటు గృహ, వాణిజ్య అవసరాలకు సైతం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించాలని అందుకు తీసుకోవాల్సిన చర్యలను ప్రతిపాదనల్లో ఉంచారు. కుప్పం నియోజకవర్గంలో అవసరమైన చోట్ల విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణంతో పాటు రైతులకు అవసరమైన ట్రాన్స్‌ఫార్మర్లు అందుబాటులో ఉంచాలని నిర్ణయించినట్లు తెలిసింది. ప్రధానంగా 25కె.వి. హెచ్‌విడిఎస్ ట్రాన్స్‌ఫార్మర్లను రైతులకు అందుబాటులో తేవాలని వీటిని ఇద్దరు ముగ్గురు రైతులకు కలిపి సర్వీసులు ఇచ్చేలా ప్రతిపాదనలు రూపొందించారు. అదేవిధంగా రెస్కో, ట్రాన్స్‌కోల పరిధిలో అవసరమైన చోట్ల కొత్త విద్యుత్ లైన్లు ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపారు. ముమ్ముందు కుప్పం నియోజకవర్గంలో పరిశ్రమలు రానున్న నేపథ్యంలో పరిశ్రమలకు అవసరమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన చోట్లలో 22కె.వి., 133/11కెవి విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణాలకు ప్రతిపాదించారని తెలిసింది. 2029 విజన్ డాక్యుమెంట్ పేరిట ఇలా 740కోట్లతో ఎపిఎస్‌పిడిసిఎల్, ట్రాన్స్‌కో, రెస్కో ఉన్నతాధికారులు ప్రతిపాదనలను రూపొందించి ప్రభుత్వానికి అందజేశారని సమాచారం.

## ప్రజలకు స్నేహితుడిగా...అవినీతి పోలీసులకు సింహస్వప్నంలా...

### నిర్లక్ష్యంతో, బాధితులపట్ల ఉదాసీనతతో వ్యవహరించిన పలువురిని సస్పెండ్‌చేసిన ఎస్పీ



ప్రభాతవార్త–తిరుపతి:
సహజంగానే ఖాకీదుస్తులు ధరించిన పోలీసు కానిస్టేబుళ్ళ నుండి ఎస్ఐల వరకు చట్టాన్ని అతిక్రమించి కొంత కఠినంగా వ్యవహరిస్తారనే ప్రజల్లో నానుడి బలంగా ఉంది. సాధారణ ప్రజలపట్లనేగాక ఏదేని సమస్యలతో ఫిర్యాదుచేయడానికి పోలీసుస్టేషన్‌కు వచ్చే బాధితుల పట్ల మరింత వింతవైఖరితో, మానవతాదృక్పధం మరచి వ్యవహరిస్తుంటారు. అయితే ఎప్పుడో బ్రిటీష్‌కాలంనాటి పోలీసు విధానాల్లో మార్పుతీసుకువచ్చి, ప్రజలకు మరింత చేరువగా ఉంటూ వారికి బాధల్లో, సమస్యలతో విసిగిపోయిఉంటే ఓదార్పు కలిగించాలని, దేవాలయానికి వెళ్ళినట్లు పోలీసుస్టేషన్‌కు ప్రజలు రావాలని డిజిపి స్థాయి అధికారి నుండి అదనపు డిజిలు, ఐజిలు, డిఐజిలు, జిల్లా ఎస్పీల వరకు ఉంటున్న పోలీసు ఉన్నతాధికారులు హితవు పలుకుతుంటారు. చట్టం పరిధిలో వ్యవహరించాలని, ప్రజల పట్ల మానవతాదృక్పధంతో మెలగాలనేది ప్రస్తుత పోలీసింగ్.అయినా ఇప్పటికీ చాలామంది పోలీసుల్లో మార్పు రాకపోగా బాధితులపట్ల బాధ్యతారాహిత్యంగా వ్యవహరిస్తున్న వాళ్ళు లేకపోలేదు. ఇప్పుడు తిరుపతి జిల్లాకు వచ్చిన ఎస్పీ లంకెల సుబ్బరాయుడు ప్రజా ఎస్పీగా పేరుతెచ్చుకుంటున్నారు. ప్రజలవైపు ఆలోచన చేస్తూ వారికి కలిగిన ఇబ్బందులును తెలుసుకుంటూ తప్పులు చేసిన పోలీసుకానిస్టేబుళ్ళ నుండి హెడ్‌కానిస్టేబుళ్ళు, ఏఎస్ఐలు, ఎస్ఐలు, చివరకు సిఐ అధికారుల వరకు అందరికీ తగిన రీతిలో శిక్షవేస్తున్నారు. ఇప్పటికే తిరుపతి జిల్లాలో చంద్రగిరి, శ్రీకాళహస్తి, వరదయ్యపాళ్యం, తిరుపతి ట్రాఫిక్, తిరుపతి రూరల్ పోలీసుస్టేషన్‌లలో పలు కారణాలతో ఐదారుమంది కానిస్టేబుళ్ళు సస్పెండ్‌కు గురికాగా, కొందరు పనిష్మంట్‌క్రింద, తాజాగా ఓ ఏఎస్ఐ సస్పెండ్ వేటుకు గురయ్యాడు. ఏకంగా నిర్లక్ష్యం ఘటనలో ఓ సిఐకు ఛార్జిమెమో అందింది. పోలీసుశాఖలో ప్రక్షాళన తీసుకువచ్చి, పోలీసులు నీతి,నిజాయితీతో అంకితభావంతో ప్రజలకు సేవలందించాలని తనదైన శైలిలో లంకెల సుబ్బరాయుడు రోజువారీగా హితవు చేస్తున్నా ఇవేమీ తమకు పట్టనట్లు వ్యవహరిస్తున్న కొందరు కానిస్టేబుళ్ళపై చట్టప్రకారం చర్యలకు ఉపక్రమించాడు. మరీ మండల పోలీసుస్టేషన్‌లలో హెడ్ కానిస్టేబుళ్ళు, ఏఎస్ఐలు, ఎస్ఐల వ్యవహారం భిన్నంగా తయారైందనే ఫిర్యాదులు, నివేదికలు కూడా ప్రజా ఎస్పీ లంకెలకు చేరాయి. ఈ నేపధ్యంలో పలువురు పోలీసులు తప్పుచేయాలన్నా భయపడే పరిస్థితులు వచ్చాయి. ఇప్పటికీ తిరుపతి జిల్లాలో మండల పోలీసు స్టేషన్‌లలో సిఐలు ఎస్‌హెచ్ఓలుగా ఉంటున్నా ఎస్ఐలు ఏఎస్ఐలే ఏక్‌నిరంజన్‌లగా తయారై చెప్పిందే శాసనం....మాటే చట్టంగా ప్రవర్తిస్తున్న వారు ఉన్నారంటే అతిశయోక్తి లేదు. ఏదేని దొంగతనాలు, రోడ్డుప్రమాదాలు ,వాహనాలు ఢీకొనడం ,గొడవలు పడటం వంటి సంఘటనలు జరిగినపుడు హెడ్‌కానిస్టేబుళ్ళు, ఏఎస్ఐలు, ఎస్ఐల వ్యవహారం మరీ పోలీసుశాఖకు చెడ్డపేరు తెచ్చేలా మారిందనేది ఎస్పీకి అందిన సమాచారం. ఇలాంటి విధి నిర్వహణలో నిర్లక్ష్యంపై వారిని విఆర్‌కు పంపడం, సస్పెండ్ చేయడం, ఛార్జిమెమోతో మార్పుతీసుకురావడానికి ఎస్పీ లంకెల సుబ్బరాయుడు పనితీరుకు పోలీసుశాఖలో హ్యాట్సాప్ చెబుతున్నారు. ఇక ప్రజల్లో ప్రజా ఎస్పీగా చర్చించుకుంటున్నారు. మరీ ఇంతటి సాహసంతో ఫ్రెండ్లీ పోలీసు వాతావరణం తీసుకువస్తున్న ఎస్పీ సుబ్బరాయుడుకు ప్రజలు కూడా సహకరించాలని పోలీసు వర్గాలు, మేధావులు కోరుతున్నారు.

### వరదయ్యపాళెం ఎఎస్ఐ సస్పెన్షన్

వరదయ్యపాళెం,ఆగస్టు 22 ప్రభాతవార్త
విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వరదయ్యపాళెం ఎఎస్ఐ షణ్ముంగా రెడ్డిని సస్పెండ్‌చేస్తూ జిల్లా ఎస్పి ఎల్.సుబ్బ రాయుడు చర్యలు తీసుకున్నారు.ఈ సందర్భంగా ఎస్పి మాట్లాడుతూ పోలీసుశాఖలో క్రమశిక్షణ, జవాబుదారి తనం చాలా ముఖ్యమని అది లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. వరదయ్యపాళెం ఎఎస్ఐ విధి నిర్వహణలో అతసత్వాన్ని,నిర్లక్ష్యం ధోరణి ప్రదర్శించిన నేపధ్యంలో సస్పెన్షన్ చేసినట్లు తెలిపారు. వరదయ్యపాళెం పోలీసుస్టేషన్ ఇన్‌చార్జిగా విధులునిర్వహిస్తున్న ఎఎస్ఐ షణ్ముగం ఆదివారం రాత్రి గొడవలతో రక్తగాయంతో స్టేషన్‌కు వచ్చిన వ్యక్తిని విచారించి తగు చర్యలు తీసుకోవటంలో విఫలమైన కారణంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రవర్థనను సహించేది లేదని ఎస్పి ఎల్ సుబ్బరాయుడు తెలిపారు.ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఎస్పి ఇలా తెలిపారు. ఆదివారంరాత్రి 11 గంటలకు ఇందిరా నగర్‌కు చెందిన ఇరువురు గాయపడ్డారు.డ్యూటీలో ఉన్న పిసి ఎఎస్ఐ షణ్ముగం ఫోన్‌ద్వారా సమాచారం అందించారు.అయితే ఆ సమయంలో ఎఎస్ఐ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దాంతో ఆయన అలసత్వంకు సంబంధించి ఎస్పి ఫిర్యాదుచేసారు. ఆయన మానవత్వం మరచి బాధ్యతా రాహిత్యంగా వ్యవహారించినందున సస్పెండ్‌చేస్తున్నట్లు ఎస్పి ఎల్ సుబ్బరాయుడు ప్రకటించారు.దాంతో పోలీసు వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

## అయ్యో పాపం..!

### - రోడ్డుపక్కన అప్పుడే పుట్టిన శిశువు- ఆసుపత్రికి తరలించిన స్థానికులు



నాయుడుపేట, ఆగస్టు 22 ప్రభాతవార్త
అప్పుడే పుట్టిన ఆడ శిశువు రోడ్డుపక్కన పడేసి వెళ్లిన సంఘటన నాయుడుపేట మండలం తిమ్మాజికండ్రిగ గ్రామ సమీపంలో చోటుచేసుకుంది. పురిటిబిడ్డ ఏడుపు విన్న స్థానికులు అక్కడికి చేరుకొని పరిశీలించారు. అనంతరం ఆ బిడ్డను నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆ బిడ్డను పరీక్షించిన వైద్యులు ఆరోగ్యకరంగా ఉన్నట్లు తెలియ జేశారు. అయితే అప్పుడే పుట్టిన ఆ బిడ్డను టవల్‌లో చుట్టేసి రోడ్డుపక్కన ఓ మైలు రాయి పక్కన పడేసి వెళ్లడంపై పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎందుకిలా కర్కశంగా వ్యవహరించారన్నది అర్థంకావడం లేదని ప్రజలు అంటున్నారు. బిడ్డను వదిలించుకునేంత కష్టం ఎవరికి వచ్చిందని ప్రశ్నిస్తున్నారు. శిశువుకు ఆసుపత్రిలో చికిత్స అందిస్తున్నట్లు సమాచారం అందుకొని తమ సంరక్షణలోకి తీసుకున్నట్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమామహేశ్వరి తెలిపారు. శిశువు ఆరోగ్యంగా ఉందని వైద్యులు తెలియజేశారని, సిడీసీ కమిటీ ఆధ్వర్యంలో తిరుపతి శిశు గృహానికి తరలిస్తామని తెలియజేశారు.

## ఉత్సాహం.. ఉత్కంఠ

### - నామినేటెడ్ పదవులపై ఆశల పల్లకీలో ద్వితీయ శ్రేణి నేతలు

కోట, ఆగస్టు 22 ప్రభాతవార్త
నామినేటెడ్ పోస్టులు భర్తీకి అధిష్టానం కసరత్తు ప్రారంభించిందన్న సమాచారంతో తెలుగుదేశం పార్టీ నేతలు, శ్రేణుల్లో ఎనలేని ఉత్సాహం, ఉత్కంఠ నెలకొన్నాయి. పార్టీలో పలువురు కీలక నాయకులతో పాటు ద్వితీయ శ్రేణి నాయకులు ఎవరికి ఏ పదవి వరించబోతుందో అని ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ప్రధానంగా గత ఎన్నికల్లో పాశిం సునీల్‌కుమార్ గెలుపు కోసం కోట మండలంలో యువనేత తీగల సురేష్‌బాబు, మరి కొందరు రాత్రనక పగలనకా విశేషంగా కృషి చేశారు. టీడీపీ యువనేత తీగల సురేష్‌బాబుకు పార్టీ ఏ పదవి కట్టబెడుతుందో అనేది ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో ఆసక్తికరంగా మారింది. గతంలో నిర్వహించిన మహానాడు విజయవంతం చేయడంలోను ఆయన కీలకభూమిక పోషించారు. అనంతరం నారా లోకేష్‌బాబు యువగళం పాదయాత్ర విజయవంతానికి సురేష్‌బాబు తనవంతు కృషి చేశారు. ఆయనను తెలుగుదేశం పార్టీ ఎలా గౌరవిస్తుందో అన్నది ఆసక్తి నెలకొంది. నామినేటెడ్ పోస్టుల భర్తీలో తనకు ప్రాధాన్యత దక్కుతుందన్న ఆశతో ఉన్నారు. తెలుగుదేశం పార్టీ తన భాగస్వామ్య పక్షాలకు నామినేటెడ్ పదవుల విషయంలో ప్రాధాన్యత ఇవ్వాలని నిర్ణయించింది. దీంతో జనసేన, బిజెపి నాయకులు కూడా ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. జిల్లాలోని ఎన్‌డిసిసిబి, డిసిఎంఎస్, గ్రంథాలయ సంస్థ, మార్కెట్ కమిటీ ఛైర్మన్లు, రాష్ట్రస్థాయి కార్పొరేషన్ డైరెక్టర్ల పదవుల కోసం పలువురు ద్వితీయ శ్రేణి నాయకులు దృష్టి సారించారు.




## సూపర్ సాధిక్ ఆలీ !

### -రూ.50లక్షల లిక్విడ్‌గంజాయి పట్టివేత



తిరుపతి,ఆగస్ట్ 22ప్రభాతవార్త:
యాత్రాస్థలం,పుణ్యక్షేత్రం తిరుపతిలో గంజాయి, మాదక ద్రవ్యాలు విక్రయాలు జరుగుతున్నాయని, కేంద్రంగా రవాణాచేస్తున్నారని మేధావులు, విద్యావేత్తలు చివరకు ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంది. ఇదే సమయంలో గంజాయి అక్రమరవాణాపై ఉక్కుపాదం మోపేలా జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు చర్యలు తీసుకుంటున్నారు. తిరుపతిరూరల్ ఎంఆర్‌పల్లి సర్కిల్ సిఐగా బాధ్యతలు చేపట్టిన సాధిక్ ఆలీ కొన్నిగంటల్లోనే భారీమొత్తంలో అక్రమరవాణా జరుగుతున్న గంజాయిని పట్టుకోవడం ఆయన పనితీరుకు నిదర్శనంగా మారింది. ఇదే సమయంలో రూరల్ సిఐగా ఆలీ బాధ్యతలు చేపట్టిన కొన్ని గంటల్లోనే కేరళ రిజిస్ట్రేషన్ వాహనంలో 50లక్షలు రూపాయలు విలువైన లిక్విడ్ గంజాయి ప్యాకింగ్‌చేసిన దాన్ని ఎంఆర్‌పల్లి పోలీసులు నాయుడుపేట–చిత్తూరు జాతీయ రహదారిపై పట్టుకున్నారు. ముగ్గురు వ్యక్తులు పరారయ్యారు. వాహనంలోని గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. రూరల్ సిఐగా సాధిక్ ఆలీ తనదైన శైలిలో మొదటికేసును చేజ్‌చేసి గంజాయిని పట్టుకోవడంతో జిల్లా ఎస్పీ లంకెల సుబ్బరాయుడు, అదనపు ఎస్పీ వెంకట్రావు, నాగ భూషణం అభినందించారు. ఆయనకు రూరల్ ఎంఆర్ పల్లి ఎస్ఐ నాగేంద్ర బాబు, షేక్‌షావలి, ఐడి పార్టీ ఏఎస్ఐ జి.రాఘవ, జోగా రావు,పోలీసు సిబ్బంది సహకారం అందించారు.



## ప్రధాన రహదారిలో ఫుట్‌పాత్ దుకాణాల తొలగింపు

కుప్పం, ఆగస్టు 22 ప్రభాతవార్త



కుప్పం తహశీల్దార్ కార్యాలయ ప్రాంగణం ఎదుట రోడ్డు పక్కన గల పలు ఫుటపాత్ దుకాణాలను గురువారం మున్సిపల్ కమీషనర్ శ్రీనివాసరావు ఖాళీ చేయించారు. ఈ దుకాణాల స్థానంలో వాహనాల పార్కింగ్‌కు కేటాయించాలని నిర్ణయించినట్లు కమీషనర్ తెలిపారు. తరచూ జిల్లా ఉన్నతాధికారుల పర్యటనలు ఉంటున్న నేపథ్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద అధికారుల వాహనాలు నిలిపేందుకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు కమీషనర్ తెలిపారు. దీంతో కార్యాలయం ముందరి భాగాన ఉన్న ఫుట్‌పాత్ దుకాణాలను తొలగింపజేసి వారికి వేరేచోట స్థలాన్ని కేటాయిస్తున్నట్లు చెప్పారు. అలాగే ప్రధాన రహదారిలో ఉన్న పలు దుకాణాలను సైతం క్రమబద్ధీకరిస్తామని కమీషనర్ తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ సిఐ జిటి నాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

## యువత విద్యతో పాటు క్రీడలపై మక్కువ చూపాలి

– తెదేపా రాష్ట్ర నేత గోపీనాథ్

కుప్పంరూరల్, ఆగస్టు 22 ప్రభాతవార్త



యువత విద్యతో పాటు క్రీడలపై మక్కువ చూపాలని తెదేపా రాష్ట్ర నేత గోపీనాథ్ పేర్కొన్నారు. గురువారం కొత్తపేటలో ఎన్‌పిఎల్ క్రికెట్‌టోర్నీని ఆయన ప్రారంభించి ప్రసంగించారు. సిఎం చంద్రబాబునాయుడు క్రీడలను ప్రోత్సహిస్తారని కుప్పంలో ఎమ్మెల్సీ డా॥ కంచర్ల శ్రీకాంత్ అధ్వర్యంలో ఎన్టీఆర్ స్టేడియాన్ని మరింత ఆధునీకరించి క్రీడాకారులకు అందుబాటులో తీసుకువస్తామన్నారు. యువత గెలుపోటములను పక్కనపెట్టి క్రీడాస్ఫూర్తితో రాణించాలని సూచించారు. క్రీడలకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మహేష్, గంగమ్మగుడి మాజీ ఛైర్మన్ ఆర్ఆర్ రవి, పార్టీ విస్తరణ కమిటీ సభ్యుడు మంజునాథ్, యూనిట్ ఇన్‌చార్జ్ అప్పు తదితరులు పాల్గొన్నారు.

## శాంతిపురం ఎంపిడిఒగా ప్రేమ్‌రాజ్‌కుమార్ బాధ్యతలు

శాంతిపురం, ఆగస్టు 22 ప్రభాతవార్త



శాంతిపురం మండల అభివృద్ధి అధికారిగా ప్రేమ్‌రాజ్‌కుమార్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఈయన వెదురుకుప్పం మండలం నుంచి ఇక్కడకు బదిలీ అయ్యారు. ఇదివరకు ఇక్కడ సూపరింటిండెంట్ హేమమాలిని ఇన్‌చార్జ్ ఎంపిడిఒగా వ్యవహరించేవారు. మండల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తానని ఆయన ఈసందర్భంగా తెలిపారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో మొక్కలు నాటే కార్యక్రమం

రామకుప్పం, ఆగస్టు 22 ప్రభాతవార్త

ఉపాధిహామీ పథకంలో భాగంగా తల్లికోసం మొక్క నాటే కార్యక్రమాన్ని గురువారం మండలంలో ప్రారంభించారు. కెంప సము ద్రం, లింగాపురం, కెంచనబళ్ల, బగళనత్తం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మండల టిడిపి అధ్యక్షుడు ఆనందరెడ్డి, మాజీ ఎంపిపి హేమ లత ఆంజనేయరెడ్డిప్రారంభించారు. విజయ్‌కుమార్‌రెడ్డి, వెంకటరమణ, సురేష్, గిరి, ఎపిఒరవికుమార్‌పాల్గొన్నా రు

## ప్రధాన సర్కిళ్లలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు

కుప్పంరూరల్, ఆగస్టు 22 ప్రభాతవార్త



కుప్పం మున్సిపల్ పరిధిలోని ప్రధాన సర్కిళ్లలో హైమాస్ట్ లైట్లను మున్సిపాలిటీ తరపున కమీషనర్ శ్రీనివాసరావు ఏర్పాటుచేస్తున్నారు. కృష్ణగిరి, ఏరియా ఆస్పత్రి సర్కిళ్లలో లైట్ల ఏర్పాటుచర్యలుపరిశీలించారు. కార్యక్రమంలోతెదేపా మున్సిపల్ ఫ్లోర్ లీడర్ జిమ్‌ద్రాము, కౌన్సిలర్ జాకీర్ పాల్గొన్నారు.

## కర్నాటక అక్రమ మద్యం స్వాధీనం - ఒకరి అరెస్టు

గుడిపాల, ఆగస్టు 22 ప్రభాతవార్త:

కర్నాటక నుండి అక్రమంగా తరలిస్తున్న మద్యంను గురువారం గుడిపాల పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్ఐ రామ్మోహన్ వెల్లడించిన వివరాల మేరకు చిత్తూరు–వేలూరు జాతీయ రహదారి నరహరిపేట చెక్‌పోస్టు వద్ద గురువారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో తమిళనాడు నుండి వస్తున్న ఒక ఇండికా కారు పోలీసులు నిర్వహిస్తున్న తనిఖీలను గమనించి వేగంగా వెళ్ళిపోవడానికి డ్రైవర్ ప్రయత్నించగా ఎస్ఐ రామ్మోహన్ తన సిబ్బందితో కలిసి కారును వెంబడించి పట్టుకుని తనిఖీ చేశారు. కారులో 13 బాక్సుల కర్నాటక టెట్రా మద్యం వున్నట్లు ఎస్ఐ రామ్మోహన్ గుర్తించారు. డ్రైవర్ రాబర్ట్(34)నుఅదుపులోకి తీసుకుని పోలీసులు విచారిస్తే మండలంలోని వెప్పాలచేనుకు చెందిన ఉదయ్‌కుమార్‌తో కలిసి తాను కర్నాటక నుండి అక్రమంగా మద్యం తీసకువచ్చి ఇక్కడ విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. డ్రైవర్ రాబర్డ్‌ను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ఈ కేసులో మరో నిందితుడిగా వున్న ఉదయ్‌కుమార్‌ను త్వరలో పట్టుకుని అరెస్టు చేస్తామని ఎస్ఐ రామ్మోహన్ తెలిపారు. ఈ దాడిలో ఎస్ఐ రామ్మోహన్‌తో పాటు కానిస్టేబుళ్ళు ఎబినేష్, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## వాతావరణ ఆధారిత పంటల సాగు

ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన కల్పించుకోండి

సోమల, ఆగస్టు 22, ప్రభాతవార్త

వర్షాధార పంటల సాగు పై రైతులు అవగాహన కల్పించుకుని ఆర్థిక దిగబడులతో పాటు ఆదాయం పొందవచ్చని జిల్లా వనరుల కేంద్ర సహాయ వ్యవసాయ సంచాలకులు నాగపద్మిని అన్నారు. 81 చిన్న ఉప్పరపల్లి పంచాయితీలో గురువారం రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరువాక శాస్త్రవేత్త సంధ్యారాణి మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయం వల్ల రైతులకు జరిగే మేలు గూర్చి వివరించారు. వర్షాధార పంటల వల్ల పంట ఖర్చులు తగ్గి ఆదాయం పెరుగుతుందని రైతులు తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారి సుధాకర్ మాట్లాడుతూ బిందు తుంపర్ల సేద్యానికి రైతులు రైతు భరోసా కేంద్రాల వద్ద పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఐదు ఎకరాల లోపు ఉన్న చిన్న సన్నకారు రైతులకు 90 శాతం సబ్సీడీతోను ఐదు ఎకరాల పై బడిన రైతులకు 70 శాతం సబ్సీడీతో పరికరాలు అందిస్తామని తెలిపారు. వ్యవసాయ సిబ్బంది కుమార్, మంజునాథ తదితరులు పాల్గొన్నారు.

## కోలాహలంగా చిరంజీవి జన్మదిన వేడుకలు

చౌడేపల్లి, ఆగస్టు 22 ప్రభాతవార్త



ప్రముఖ సినీనటుడు, మాజీ కేంద్ర మంతి చిరంజీవి జన్మదిన వేడుకలను కోలాహలంగా నిర్వహించారు. జనసేన, చిరంజీవి అభిమానుల ఆధ్వర్యంలో స్థానిక బస్టాండు నందు భారీ కేక్‌ను కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఆరోగ్య కేంద్రంలో రోగులకు పాలు, రొట్టెలందించారు. బాణా సంచాలు పేల్చి అభిమానాన్ని చాటుకొన్నారు. జనసేన నాయకులు గందోడి చరణ్, పురుషోత్తమ్, హేమంత్, లీలాకుమార్‌నాగ్, ఘనశ్యామ్, చిరంజీవి వీరాభిమాని భూదేవి హోటల్ మురళి, జనసేన నాయకులు, చిరంజీవి అభిమానులు పాల్గొన్నారు.

## మృత్యుంజయేశ్వరస్వామికి హుండీ ద్వారా రూ. 52వేలు ఆదాయం

చౌడేపల్లి, ఆగస్టు 22 ప్రభాతవార్త

స్థానిక మృత్యుంజయేశ్వరస్వామికి హుండీ ద్వారా రూ. 52,949లు ఆదాయంగా సమకూరినట్లు గ్రూప్ టెంపుల్స్ ఇఓ కమలాకర్ తెలిపారు. గురువారం జరిగిన హుండీ లెక్కింపులో ఆలయ ప్రధానార్చకుడు రాజశేఖర్ దీక్షితులు, దేవాలయ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## హెల్మెట్ ధరించండి ప్రాణాలను రక్షించుకోండి : సిఐ రాంభూపాల్

చౌడేపల్లి, ఆగస్టు 22 ప్రభాతవార్త



హెల్మెట్ ధరించి ప్రాణాలను రక్షించుకోండని పుంగనూరు రూరల్ సిఐ రాంభూపాల్ అన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు హెల్మెట్‌లు ధరించడంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సెల్‌ఫోన్ పగలకుండా స్క్రీన్‌గార్డులు వేయించనట్లుగా ద్విచక్రవాహనాలు నడిపేవారు హెల్మెట్‌ను ధరించాలన్నారు. హెల్మెట్ లేని ప్రయాణ ప్రమాదకరమనీ, ప్రమాదం సంభవించినప్పుడు హెల్మెట్ ప్రాణదాయమన్నారు. అనంతరం హెల్మెట్ ధారణపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కళాశాల అధ్యాపకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## పెండింగ్ ఫైల్స్ సత్వర పరిష్కార దిశగా పాకాల తహశీల్దార్ కార్యాలయం

పాకాల, ఆగస్టు 22, ప్రభాతవార్త

పాకాల మండల తహశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన నిత్యానంద బాబు తమ సిబ్బందితో కలిసి ఎప్పటికప్పుడు వారితో మీటింగు ఏర్పాటు చేసి వారికి దిశా నిర్దేశం చేస్తూ అన్ని విభాగాల పై ఎప్పటికప్పుడు సమాచారం సేకరించి చాలా కాలం నుంచి వివిధ కారణాలతో భూములు క్రయవిక్రయాలు జరిగి ఆన్‌లైన్ నమోదులో తీవ్ర జాప్యం ఎదుర్కొంటున్న పలు పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కారదిశగానిర్విరామంగాతహశీల్దార్‌తమ సిబ్బందితో కలిసి పనిచేస్తున్నారు.

## జూనియర్, సీనియర్ విద్యార్థులు స్నేహపూర్వకంగా ఉండాలి

వెదురుకుప్పం, ఆగస్టు 22 ప్రభాతవార్త :



జూనియర్, సీనియర్ విద్యార్థులు స్నేహపూర్వకంగా కలిసి మెలిసి ఉండాలని వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అన్నపూర్ణ శారద పేర్కొన్నారు. గురువారం కళాశాలలో ఐక్యూఏసి మరియు ఎన్ఎస్ఎస్ వారి ఆధ్వర్యంలో ఇండక్షన్ కార్యక్రమం నిర్వహించారు. ముందుగా కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు స్వాగతం పలికి కళాశాల వాతావరణం పరిచయం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జూనియర్, సీనియర్ అనే బేధం లేకుండా అందరు కలిసి స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. తమ అనుభవాలను కొత్తగా చేరిన విద్యార్థులకు సీనియర్ విద్యార్థులు తెలియజేసి విద్యాభివృద్ధికి తోడ్పాడలన్నారు. ఇండక్షన్ కార్యక్రమం ప్రాధాన్యత గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## సమస్యలపై సత్వరం స్పందించి చర్యలు

– ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు



**చిత్తూరు, ఆగస్టు 22 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలపై అధికారులు సత్వరం స్పందించి వాటిని పరిష్కరించాలని ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు అన్నారు. మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో గురువారం ఎమ్మెల్యే గురజాల జగన్మోహన్‌నాయుడు డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమం నిర్వహించి ప్రజల నుండి ఫోన్ ద్వారా సమస్యలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గ ప్రజల నుండి సమస్యలపై 37 ఫిర్యాదులు అందాయి. వీటిని క్షేత్ర స్థాయిలో పరిశీలించి సత్వరం పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే సంబంధిత అధికారులను ఆదేశించారు. చిత్తూరు నగర పరిధిలో నీటి సరఫరా, రోడ్ల నిర్మాణాలు, డ్రైనేజి సమస్యలపై అధికంగా ఫిర్యాదులు వస్తున్నాయని వీటిని సరి చేయాలని అధికారులను ఆదేశించారు. ఈ నెల 8న నిర్వహించిన డయల్ యువర్ ఎమ్మెల్యే కార్యక్రమానికి 34 ఫిర్యాదులు ప్రజల నుండి వస్తే అందులో 19 సమస్యలను పరిష్కరించడం జరిగిందని, 15 సమస్యలు పురోగతిలో వున్నాయన్నారు. నగర పాలక సంస్థ పరిధికి సంబంధించి 21 సమస్యలు వస్తే అందులో 15 పరిష్కారం అయ్యాయని మిగిలిన 6 పనులకు సంబంధించి అంచనాలు రూపొందించినట్లు కమీషనర్ డాక్టర్ జె.అరుణ వెల్లడించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అముద, కమీషనర్ డాక్టర్ జె.అరుణ, డిప్యుటీ మేయర్ రాజేష్‌కుమార్‌రెడ్డి, అసిస్టెంట్ కమీషనర్ రామకృష్ణుడు, మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు, చిత్తూరు రూరల్, గుడిపాల మండల అధికారులు పాల్గొన్నారు.

## కుప్పంలో హోటళ్లపై కమిషనర్ మెరుపుదాడులు

– వెలుగుచూసిన కాల ం చెల్లిన మాంసం..

– నాణ్యమైన ఆహారం అందించకుంటే చర్యలు తప్పవు !!

కుప్పం, ఆగస్టు 22 ప్రభాతవార్త



కుప్పం పట్టణంలోని పలు హోటళ్లపై మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు అర్బన్ సిఐ జిటి నాయుడుతో కలసి మెరుపు దాడులు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయా హోటళ్లలో వంటరూములు, వంటకు వినియోగించే పదార్థాలు, మాంసం తదితరాలను పరిశీలించారు. ఈసందర్భంగా ఓ హోటల్‌లో కొంత మేర కాలం చెల్లిన చికెన్‌ను గుర్తించారు. ఇలాంటి వాటిని వండి విక్రయాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని ఆయన హోటల్ యజమానికి హెచ్చరించారు. మరో హోటల్‌లో కిచెన్ రూంను తనిఖీ చేశారు. ప్రజలకు నాణ్యతలేని ఆహారం అందించి ఏదేని అనర్థాలు జరిగితే మాత్రం హోటళ్లను సీజ్ చేయడం జరుగుతుందని హెచ్చరించారు. అలాగే ఆహార పదార్థాలను నిర్ణీత ధరలకే విక్రయించాలని అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం రెండు హోటళ్ల యజమానులకు జరిమానా విధించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆక్రమితదారుల చేతుల్లో ఆలయ భూములు

–వేలం పాటను అడ్డుకొన్న గ్రామస్తులు

–వాయిదా వేసిన అధికారులు

చౌడేపల్లి, ఆగస్టు 22 ప్రభాతవార్త



ఆలయ భూమిలో అక్రమ కట్టడాలు దురాక్రమణలుంటే వేలం ఎలా వేస్తారంటూ...గ్రామస్తులు దేవాదాయధర్మాదాయశాఖ అధికారులను నిలదీశారు. ఆక్రమణలు తొలగించి పాటకు రండని కొందరు హుకుం జారీ చేయడంతో చేసేది లేక వేలం పాటను వాయిదా వేసుకొని వెళ్లారు. చౌడేపల్లి పరిధిలోని గోసలకురపల్లి కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయ భూములకు దేవాదాయ ధర్మాదాయశాఖ పుంగనూరు గ్రూప్ టెంపుల్స్ ఇఓ కమలాకర్ వేలం పాటలు నిర్వహించేందుకు అధికారులతో ఆలయం వద్దకు వచ్చారు. పట్టణ పరిధిలోని కోట్లాది రూపాయలు విలువ చేసే సర్వేనంబర్ 156–4లోగల 11ఎకరాల్లో దురాక్రమణలు జరిగాయనీ, వాటిని తొలగించి వేలం పాట నిర్వహించాలని డాక్టర్ మహేష్, సుధాకర్ తదితరులు పట్టుబట్టారు. అదే విధంగా సర్వేనంబర్ 78లో 1.88ఎకరాల దేవుని మాన్యాన్ని వేలం పాట రికార్డుల్లోకి ఎక్కించాలన్నారు. 11ఎకరాల స్థలాన్ని 3యేళ్ళ పాటు లీజుకు తీసుకొనే రైతు పంటలు పండించేందుకు వీలులేదనీ, దురాక్రమణదారులతో నిత్యం తగవులాడుకోవాల్సి వస్తోందన్నారు. స్పందించిన అధికారులు వేలం పాటను వాయిదా వేశారు. ఆక్రమితదారులను ఖాళీ చేయాలని వారి వద్దకు వెళ్ళి మరీ ఆదేశాలు జారీ చేసారు. కాగా వేలం పాటల నిర్వహణలో తొలి నుంచి ఉద్రిక్తత వాతావరణం నెలకొనింది. ఎండోమెంట్ ఇన్స్‌స్పెక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## మెగాస్టార్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసిన అంకారావు

చిట్టమూరు, ఆగస్టు 22 ప్రభాతవార్త



భారతీయ సినీరంగంలో రారాజు, పద్మవిభూషణ్, మెగాస్టార్ డాక్టర్ చిరంజీవి జన్మదినం సందర్భంగా గురువారం చిట్టమూరు మండలానికి చెందిన గంధం అంకారావు శుభాకాంక్షలు తెలియజేశారు. గురువారం తిరుపతి రేణిగుంట విమానాశ్రయం వద్ద మెగాస్టార్ చిరంజీవి 69వ జన్మదినం సందర్భంగా అంకారావు శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. చిట్టమూరు మండలం అద్దిపూడి గ్రామానికి చెందిన అంకారావు ఉపాధ్యాయ వృత్తిలో కొనసాగుతూ ఎంద రో విద్యార్థులకు ఉత్తమ సేవలు అందించి పలువురికి ఆదర్శంగా నిలిచారు. తన స్వగ్రామంలో, మండలంలో కనివినీ రుగని రీతిలో వెంకటేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించి భక్తిని చాటుకున్నారు. మొదటి నుంచి చిరంజీవి అభిమానిగా ఉన్న అంకారావు, వారి కుటుంబసభ్యులు ఆయనను కలిసిన నేపథ్యంలో సంతోషం వ్యక్తం చేశారు.

## కోట గురుకులంలో వసతులపై ఆరా

కోట, ఆగస్టు 22 ప్రభాతవార్త



అనకపల్లి జిల్లా కైలాసపట్నంలో ప్రైవేటు వసతి గృహంలో కలుషితాహారం కారణంగా నాలుగు రోజుల క్రితం ముగ్గురు చిన్నారులు మృతి, పలువురు తీవ్ర అస్వస్థతకు గురైన విషయం తెలిసిందే. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు కోట మండలంలోని ఎంపిడివో నాలుగు రోజులకు మండలంలోని అన్ని వసతి గృహాలను క్షణంగా తనిఖీ చేస్తున్నారు. ఈ క్రమంలో గురువారం కోటలోని గిరిజన బాలికల వసతి గృహాన్ని చిట్టేడు ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ నాగరాజు పరిశీలించారు. వసతి గృహంలో మౌలిక సదుపాయాలు, పారిశుధ్యం సక్రమంగా ఉందా లేదానని ఆయన క్షణంగా తనిఖీ చేశారు. మెనూ ప్రకారం ఆహారం అందిస్తున్నారా లేదనిని విద్యార్దులను అడిగి తెలుసుకున్నారు. తాగునీరు వంట శాలల పరిశుభ్రత వంటి అంశాల్లో జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. హాస్టల్ నిర్వహణ బాగుందని ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు.

## పోలంరెడ్డి కుటుంబ సభ్యులకు సాయికృష్ణ యాచేంద్ర పరామర్శ

వెంకటగిరి, ఆగస్టు 22, ప్రభాతవార్త



ఇటీవల మృతి చెందిన మాజీ ఎంపిపి పోలంరెడ్డి వెంకటరెడ్డి కుటుంబ సభ్యులను మాజీ ఎమ్మెల్యే డాక్టర్ విబి సాయి కృష్ణ యాచేంద్ర పరామర్శించారు. మాజీ ఎంపిపి వెంకటరెడ్డి తమ కుటుంబానికి మంచి సన్నిహితుడని సాయికృష్ణ గుర్తు చేశా రు. ఆయన మృతి చాలా బాధ కలిగించిందని ఆవేద నచెందారు. వెంకటరెడ్డి తనయుడు కోటేశ్వరరెడ్డిని ఓదార్చారు. ఆయన వెంట ఆవుల వెంకటేశ్వర్లు యాదవ్ ఉన్నారు.

## గ్రామ సభలను సద్వినియోగం చేసుకోండి

ఎంపిడివో డీజే వినీల్ కుమార్

బాలాయపల్లి, ఆగస్టు 22, ప్రభాతవార్త



ఉపాధి హామీ పథకం పనుల ఎంపిక కోసం ఈ నెల 23వ తేది మండలంలో జరిగే గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపిడివో డీజే వినిల్ కుమార్ తెలిపారు. మండలంలోని 24 పంచాయితీల్లో ఉపాధి పనులు కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రామ సభల నిర్వహణకు అధికారులతో కమిటీ వేసినట్లు చెప్పారు. గ్రామాల్లో చేపట్టవల్సిన ఉపాధి పనులు కూలీలు ఎంపిక తదితర వాటిపై గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

## శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆరు కుటుంబాలకు ఫలసరుకులు, కూరగాయలు పంపిణీ

వాకాడు, ఆగస్టు 22, ప్రభాతవార్త

వాకాడు మండలం బాలిరెడ్డిపాళెం గ్రామంలోని శుక్రవారం శ్రీ పట్టాభిరామాలయం, శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆర్థికంగా వెనుకబడిన ఆరు కుటుంబాలకు 20 వేల రూపాయిల విలువచేసే ఫలసరుకులు, కూరగాయలు, నెల్లూరు జిల్లా శ్రీ వైఖానస సంఘం సభ్యులు కందుకూరు శేషాచార్యులు, వాకాణి కళ్యాణకృష్ణ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అతిధులు మాట్లాడుతూ దాతల సహాయ సహకారాలతో శ్రీ సీతారామ ధార్మిక సేవా సంస్థ అనేక ధార్మిక సామాజిక సేవ కార్యక్రమాలను చేస్తున్నదని ఈ సందర్భంగా దాతలకు, సంస్థ ప్రతినిధులకు వ్యవస్థాపకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

## జిమ్ సెంటర్ ప్రారంభించిన ఎమ్మెల్యే

గూడూరు, ఆగస్టు 22, ప్రభాతవార్త



గూడూరు పట్టణంలోని వివేకానంద రోడ్డులో ఏర్పాటు చేసిన వెంకట్ ఫిట్నెస్ జిమ్ సెంటర్‌ను గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ గురువారం ప్రారంభించారు. జిమ్ సెంటర్‌లో ఉన్న వసతులను పరిశీలించి జిమ్ సెంటర్ నిర్వాహకులను అభినందించి అభినందనలు తెలిపారు. జిమ్ సెంటర్‌లో మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం ఇంపార్టెంట్ ఎక్విప్మెంట్ అందుబాటులోకి తీసుకువచ్చి శిక్షణ పొందిన మహిళలచే ప్రత్యేకంగా మహిళలకు శిక్షణ పొందిన మహిళలచే ప్రత్యేకంగా మహిళలకు శిక్షణ ఇవ్వడం అభినందనీయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. గూడూరు పట్టణ పరిసర ప్రాంత ప్రజలు ఈ ఫిట్నెస్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిఐ శేఖర్ బాబు, ఎస్సై మనోజ్ కుమార్, టిడిపి నాయకులు భాస్కర్ రెడ్డి, వెంకటేశ్వర రాజు, ఉమ్మడి వెంకటేశ్వర్లు, మధు యాదవ్, జిమ్ సెంటర్ నిర్వాహకులు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పంచాయితీల్లో గ్రామసభలు ...ఎంపిడిఓ

దొరవారిసత్రం ఆగస్టు 22 ప్రభాతవార్త ;

దొరవారిసత్రం మండలంలోని 22గ్రామపంచాయితీల్లో గురువారం గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందని ఎంపిడిఓ రఘురామయ్య తెలియజేశారు. ఈసందర్భంగా ఎంపిడిఓ రఘురామయ్య మాట్లడుతూ మండలంలోని 22గ్రామపంచాయితీల్లో ఉదయం 11గంటలనుండి గ్రామసభలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ఈగ్రామసభలో ముఖ్యంగా ఉపాధిహామి పథకం ద్వార గ్రామాల్లో చేయాల్సిన అబివృద్ది పనులను గుర్తించడం జరుగుతుందన్నారు. ఈగ్రామసభలకు అధికారులు, ప్రజాప్రతినిదులు తప్ప నిసరిగా హజరుకావాలని ఆయన సూచించారు.

## గ్రామసభల్లో పాల్గొనండి

జనసేన పార్టీ ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్

గూడూరు, ఆగస్టు 22, ప్రభాతవార్త



రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ బాధ్యత వహిస్తున్న పంచాయితీ రాజ్ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నిర్వహించే గ్రామ సభల్లో జనసేన నాయకులు, జన సైనికులు పాల్గొని గ్రామ సభలను విజయవంతం చేయాలని జనసేన లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి ఉమ్మడి నెల్లూరు జిల్లా ఉపాధ్యక్షులు తీగల చంద్రశేఖర్ రావు కోరారు. గూడూరు జనసేన పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సభల్లో ఉపాధి హామీ పనులు ఆమోదం కోసం రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 13326 పంచాయితీల్లో ఒకే రోజు జరిగే ఈ గ్రామ సభల్లో ఉపాధి హామీ పథకం ద్వారా 4500 కోట్లతో 87 రకాల పనులకు ఆమోదం జరుగుతుందన్నారు. జనసేన పార్టీ నాయకులు అక్బర్ కుమార్, క్రాంతి, గోపాల్ పాల్గొన్నారు.

## గురుకులంను పరిశుభ్రంగా ఉంచుకోండి

తహశీల్దార్ రామయ్య

వాకాడు, ఆగస్టు 22, ప్రభాతవార్త



ఎన్ని సమస్యలు ఉన్న గురుకుల పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వాకాడు తహశీల్దార్ రామయ్య గురుకుల పాఠశాల సిబ్బందికి సూచించారు. శుక్రవారం వాకాడులోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలను తహశీల్దార్ రామయ్య, ఎంపిడివో వెంకటేశ్వర్‌రావు, ఎంఈఓ నాసిమ్ ఆలీ, పిఆర్ఏఈ కిరణ్‌లు ఆకస్మికంగా తనిఖీ చేశారు. త్రాగునీటి కుళాయిలను పరిశీలించి కుళాయి ఉన్న చోట ఆవరణంలో బ్లీచింగ్ పిచికారి చేయాలని సూచించారు. అదే విధంగా వంటశాల ఆవరణంలో పాతర్లు పరిశుభ్రంగా ఉంచాలని, లేని యెడల చర్యలు తీసుకుంటామని ఆదేశించారు. ముఖ్యంగా మూత్రశాల ప్రదేశంలో రోజుకు ఒకసారి బ్లీచింగ్ చల్లాలని సూచించారు. దోమలు బెడద లేకుండా ప్రత్యామ్నాయంగా తగు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో విఆర్ఓ కాటమ్మ, సిబ్బంది, గురుకుల పాఠశాల సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## గ్రామసభలను విజయవంతం చేయండి

కోట, ఆగస్టు 22 ప్రభాతవార్త

శుక్రవారం నుంచి జరిగే గ్రామసభలను విజయవంతం చేయాలని తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. గురువారం ఆయన మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామసభల్లో ఉచిత ఇసుక విధానంపై మార్గదర్శకాలు వివరించాలని, ఇసుక రీచ్‌ల నుంచి తవ్వకాలు, రవాణా ఛార్జిల ధరలను నిర్ధారించాలని కోరారు. ఉపాధి హామీపై ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు గ్రామాల్లో విద్య, వైద్యం, తాగునీరు, రోడ్లు తదితర విషయాలపై అవగాహన కల్పించాలన్నారు. నూరుశాతం సామాజిక తనిఖీలపై గ్రామసభలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. పామ్‌పాండ్లు నిర్మాణం, పట్టు పరిశ్రమలకు తోడ్పాటు అందించడం, పశువులకు షెడ్లు నిర్మాణం వంటి వాటిపై చర్చించాలని కోరారు.

## రైతులు కలుపు నివారణపై దృష్టి సారించాలి

కెవికే అధిపతి డాక్టర్ బిజి రాజు

వెంకటగిరి, ఆగస్టు 22, ప్రభాతవార్త



పంటల్లో కలుపు నివారణ పై రైతులు దృష్టి సారించాలని కెవికె అధిపతి డాక్టర్ బిజే రాజులు తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం నందు 19వ వయ్యారి భామ కలుపు నిర్మూలన అవగాహన వారోత్సవాలులో భాగంగా 16 నుండి 22 వరకు వివిధ కార్యక్రమాల ద్వారా రైతులలో, విద్యార్థులలో వయ్యారి భామ కలుపు నిర్మూలన మీద అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కృషి విజ్ఞాన కేంద్రంలో వయ్యారి భామ కలుపు నిర్మూలనకు గాను జీవ నియంత్రణ పద్ధతుల ద్వారా జీగో గ్రామా బైకలరట అనే పరన్నా జీవి ద్వారా నిమ్మతోటలలో వయ్యారి భామ నిర్మూలించవచ్చు అని కృషి విజ్ఞాన కేంద్రం అధిపతి గోవిందం రాజులు తెలియజేయడం జరిగింది. వయ్యారి భామ కలుపు పంటలో పెరిగి పంట దిగుబడికి నష్టం కలిగిస్తుంది అని ఏడిఏ నాగార్జున సాగర్ తెలియజేశారు. జీగో గ్రామా బైకలరట అనే పెంకు పురుగు ఎరుపు రంగులో ఉంది. నల్లటి చారాలు గల రెక్కలు కలిగి ఉంటుంది. ఈ పెంకు పురుగును వయ్యారి భామ కలుపు మీద వదలడం ద్వారా సామూహిక ప్రదేశాలలో నిర్మూలించవచ్చు అని శాస్త్రవేత్త రాజీవన తెలిపారు. తరువాత కృషి విజ్ఞాన కేంద్రం ఫార్మ్ నందు నిమ్మ తోటలో జీగో గ్రామా బైకలరట పరన్నా జీవిని విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు విజయ శ్రీ, నాగార్జున రెడ్డి, తిరుపాల్, రైతులు పాల్గొనడం జరిగింది.

## మెగాస్టార్ చిరంజీవి సేవాసంఘంచే ఆర్థికసాయం

సూళ్లూరుపేట, ఆగస్టు 22 ప్రభాతవార్త

డాక్టర్, పద్మవిభూషణ్, మెగాస్టార్ చిరంజీవి జన్మదినాన్ని పురస్కరించుకొని చిరంజీవి సేవాసంఘం ఆధ్వర్యంలో గురువారం గొల్లలమొలువు గ్రామానికి చెందిన పోలయ్య కుటుంబానికి రూ.14 వేలు ఆర్థిక సాయం, ఒక బియ్యం బస్తాను అందజేశారు. ఈ సందర్భంగా చిరంజీవి సేవాసంఘం అధ్యక్షులు మాబాషా మాట్లాడుతూ ఇటీవల అగ్ని ప్రమాదంలో ఇల్లు కాలిపోయిన బాధిత కుటుంబానికి చిరంజీవి 69వ జన్మదినం సందర్భంగా తమ వంతు సాయంగా రూ.14 వేలు ఆర్థిక సహాయం, బియ్యం బస్తా అందజేశామని తెలిపారు. హరిబాబు, కోటయ్య, దాస్, రమణ, పద్మజ తదితరులు పాల్గొన్నారు.

## భూసార పరీక్షా ఫలితాలను అనుసరించి ఎరువులు వాడండి

తడ, ఆగస్టు 22 ప్రభాతవార్త



భూసార పరీక్షా ఫలితాలను అనుసరించి ఎరువుల వాడకం ద్వారా ఆశించిన పంట దిగుబడిని పొందవచ్చని వ్యవసాయాధికారులు పేర్కొన్నారు. గురువారం తడ మండలం చేనిగుంటలో రైతులతో ఒక కార్యక్రమంలో పాల్గొన్నారు. భూమి యొక్క భూ, భౌతిక లక్షణాలను మెరుగుపరచడానికి ఈ భూసార పరీక్షా ఫలితాలు ఉపయోగపడతాయన్నారు. జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ అధికారి కెవి శ్రీనివాస్ మాట్లాడుతూ రబీ సీజన్‌లో వేయాల్సిన వరిరకాలు, మేలయిన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. మండల వ్యవసాయ అధికారి కాంచన మాట్లాడుతూ చిరు ధాన్యాల సాగును రైతులందరు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఐసిఆర్‌పి సబీనా, వీఎఎ భారతి, రైతులు పాల్గొన్నారు.

## లేఅవుట్లలో ఇళ్ళ నిర్మాణాలు వేగవంతం

– మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ

చిత్తూరు, ఆగస్టు 22 ప్రభాతవార్త:



చిత్తూరు నగర పాలకసంస్థ పరిధిలోని లేఅవుట్లలో వివిధ దశల్లో వున్న ఇళ్ళ నిర్మాణాలను మరింత వేగవంతం చేయాలని మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమీషనర్ డాక్టర్ జె.అరుణ గురువారం అనుపల్లి లేఅవుట్‌లో జరుగుతున్న ఇళ్ళ నిర్మాణాలను పరిశీలించి అక్కడి లబ్దిదారులకు మాట్లాడారు. ఈ సందర్భంగా లబ్దిదారులతో కమీషనర్ మాట్లాడుతూ ఇళ్ళ నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని అందుకు కావాల్సిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. అలాగే వంద రోజుల హౌసింగ్ ప్రోగ్రాం కార్యక్రమంలో భాగంగా కమీషనర్ హౌసింగ్ అధికారులు, అనిమిటీ కార్యదర్శులు, మెప్మా సిఒలు, ఆర్పీలతో సమావేశం నిర్వహించి లేఅవుట్లలో పునాదులు పూర్తయి వివిధ దశల్లో వున్న ఇళ్ళ నిర్మాణాలను వేగంగా పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ శ్రీధర్, వార్డు అమినిటీ కార్యదర్శులు పాల్గొన్నారు.

## ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-14 క్రికెట్ బాలుర జట్టు ఎంపిక

శ్రీకాళహస్తి, ఆగస్టు 23 ప్రభాతవార్త

పట్టణంలోని కెసిసి క్రికెట్ నెట్స్‌లో రేపు మధ్యాహ్నం 2గంటలకు ఉమ్మడి చిత్తూరు జిల్లా క్రికెట్ అసోసియేషన్ అధ్యక్షుడు బి.విజయకుమార్ ఆదేశాల ప్రకారం జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో అండర్-14 బాలుర క్రికెట్ సెలెక్షన్స్ జరుగుతాయని ఇన్‌ఛార్జి దుర్గాప్రసాద్(కన్న), గోపాల్‌లు తెలిపారు. ఈ ఎంపికలో శ్రీకాళహస్తిరూరల్; అర్బన్, తొట్టంబేడు, కెవిబిపురం, ఏర్పేడు) మండల క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సెలెక్షన్స్‌కు హాజరయ్యే వారు తమ ఆధార్‌కార్డు, జనన ధృవీకరణ పత్రం, కిట్లు మరియు తెల్లని దుస్తులతో రావాలని తెలిపారు. వివరాలకు 8341540009, 9949665350 నంబర్లకు ఫోన్‌చేసి తెలుసుకోవచ్చన్నారు.

## కిడ్నీ బాధలతో తల్లడిల్లుతున్నాను! ఆదుకోండి!!

-ఓ ఫ్యాషన్ డిజైనర్ యువతి ఆవేదన



**శ్రీకాళహస్తి, ఆగస్టు 22 ప్రభాతవార్త** శ్రీకాళహస్తిలోని దక్షిణ కైలాస్ నగర్‌లోని మహాత్మాగాంధీ వీధిలో నివాసముంటున్న బి.యామిని (28) కిడ్నీల సమస్యలతో బాధపడుతూ ఆదుకోవాలని కోరుతుంది. ఈ మేరకు బుధవారం మాట్లాడుతూ ఫ్యాషన్ డిజైనింగ్ కోర్సు ను చేసిన యువతిని ఆదుకోవాలని కోరుతున్నారు. ఇక్కడ నివాసముం టున్న ప్రేమ్‌కుమార్ గతంలో హైదరాబాదులోని ఓ ప్రైవేటు రోడ్డు కంట్రాక్టు కంపెనీలో సబ్ కాంటాక్టు పనులు చేసుకుంటూ జీవనం గడిపే వారు. అయితే ఆ కంపెనీ చేతులేత్తేయటంతో ప్రేమ్‌కుమార్‌కు సంబంధించిన జెసిబిలు,టిప్పర్లను ఇవ్వక పోవటంతో అప్పుల పాలయ్యాడు. దాంతో గుండెపోటుకు గురై ఇంట్లో ఉంటున్నాడు.ఆయనకు ఇద్దరు కుమార్తెలు వారిలో యామిని ఫ్యాషన్ డిజైనింగ్‌లో పిజీ కోర్సు చేసింది.కొన్ని రోజుల పాటు హైదరాబాదులో పనిచేయడంతో పాటు, హ్యాండ్‌ల్యూమ్స్ కంపెనీలో పనిచేసి నిలిచిపోయింది. నాలుగు నెలల నుంచి అనారోగ్యానికి గురి కావటంతో తిరుపతి స్విమ్స్‌లో చికిత్స చేయటంతో రెండు కిడ్నీలు పాడయ్యాయని మార్పు చేయాలని వైద్యులు సలహ ఇచ్చారని యామిని వివరించింది. ఆమెకు పెరిటోరియల్ డయాల్సిస్ వైద్యం అందించాలని వైద్యులు పేర్కొన్నట్లు వివరించారు. ఆమెకు పెరిటోరియల్ డయాల్సిస్ వైద్యం అందించాలని వైద్యులు పేర్కొన్నట్లు వివరించారు.అయితేస్విమ్స్‌లో వైద్యులు పేర్కొన్నారని తెలిపారు. వేలూరులో ఉన్న సిఎంసి ఆసుపత్రిలో చికిత్స చేయించుకుంటే ఆరోగ్యం మెరుగుపడుతుందని వివరించినట్లు యామిని వివరించారు. అయితే తమకు ఆర్థిక స్థోమత లేదని బతకాలనే ఆశ ఉందని కాబట్టి దాతలు ఆదుకోవాలని యామిని కోరారు. దాతలు చరవాణి నంబర్ 7702852684 లలితారాణి పేరుతో ఉందని ఆదుకునే దాతలు ఫోన్‌పే, లేదా గూగుల్ పే ద్వారా ఆర్థికసాయం పంపాలని అభ్యర్థించారు.

## గ్రామసభలకు ప్రతి ఒక్కరు హాజరవ్వాలి..ఎంఎల్ఏ

శ్రీకాళహస్తి, ఆగస్టు 22 ప్రభాతవార్త



నేటి నుంచి జరిగే గ్రామసభలకు ప్రతి ఒక్కరు హాజరవ్వాలని అభివృద్ధి పనుల ఎంపికలో కీలకంగా వ్యవహరించాలని ఎంఎల్ఏ బొజ్జలసుధీర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి నుంచి పంచాయతీల్లో నిర్వహించే గ్రామసభలకు అధికారులు, ప్రజాప్రతినిధులుతో పాటు కూటమి పార్టీలకు చెందిన అన్ని కేడర్ల నాయకులు క్లస్టర్ యూనిట్, బూత్ ఇన్‌ఛార్జిలు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని ఎంఎల్ఏ తెలిపారు.2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను ఎంపిక చేసి గ్రామసభలో పంచాయతీ తీర్మానం చేయబడుతుందన్నారు. గ్రామాల అభివృద్ధికి అవసరమైన సిసి రోడ్లు, డ్రైనేజీ పనులతో పాటు ఇతర మౌళిక వసతులు కల్పనకు అవసరమైన పనులను ఈ గ్రామసభల్లో ప్రతిపాదించి తీర్మానం చేయవచ్చని ఎంఎల్ఏ వివరించారు. తీర్మానం చేసిన పనుల జాబితాను జిల్లా కలెక్టర్‌కు పంపి పరిపాలన అనుమతి పొందిన అనంతరం కేటాయించిన నిధులతో పనులు పూర్తి చేస్తారన్నారు. రాష్ట్రంలోన్ని గ్రామ పంచాయతీల్లో ఒకే రోజు గ్రామసభలు నఇర్వహించి పనులు ఎంపిక చేసి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టాలన్నదే సిఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వ లక్ష్యం అని ఎంఎల్ఏ స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న గ్రామసభల్లో అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు పార్టీ శ్రేణులు విస్తృతంగా పాల్గొని కీలకంగా వ్యవహరించాలని ఎంఎల్ఏ పిలుపునిచ్చారు.

## హైప్స్-వి హాట్‌స్పాట్ రెస్టారెంట్‌ను ప్రారంభించిన ఎంఎల్‌సి



**శ్రీకాళహస్తి, ఆగస్టు 22 ప్రభాతవార్త** పట్టణంలోని బాబుఅగ్రహారం కోనేరు వద్ద ఉన్న హైప్స్ వి మాల్‌లో రెస్టారెంట్‌ను గురువారం ఎంఎల్‌సి, రష్ ఆస్పత్రి అధినేత డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయనకు హైప్స్ వి అధినేత పెరుమాల్‌రెడ్డి దంపతులు, కుటుంబ సభ్యులు స్వాగతం పలికారు. ముఖ్యఅతిధులుగా మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు దంపతులు, పరమేశ్వరరావు వి.పవార్, బిజెపి రాష్ట్ర కార్యదర్శి కోలా.ఆనంద్ కుమార్, ఎంజిఎం విద్యాసంస్థల ఛైర్మన్ గుడ్లూరు మయూర్, గుడ్లూరు మల్లికార్జుననాయుడు, రాష్ట్ర బిసి నాయకుడు వడ్లతాంగల్‌బాలా జీప్రసాద్‌రెడ్డి, సురేష్, న్యాయవాది మాదుపూరు ప్రసాద్, స్వామిరెడ్డి భరత్‌రెడ్డిలు హాజరయ్యారు. ఈసందర్భంగా ఎంఎల్‌సి డాక్టర్ సిపాయిసుబ్రమణ్యం మాట్లాడుతూ నగరాల్లో ఉన్న రెస్టారెంట్లకు దీటుగా సామాన్యులకు అందుబాటులో ఉండేవిధంగా కుటుంబసభ్యులతో హాయిగా రెస్టారెంట్‌కు వచ్చి వెళ్ళవచ్చన్నారు. ఆధ్యాత్మిక క్షేత్రంలో హైప్స్-వి హాట్‌స్పాట్ రెస్టారెంట్ ప్రారంభించడం సంతోషంగా ఉందన్నారు. రెస్టారెంట్‌ను ఏర్పాటు చేసిన అధినేత పెరుమాల్‌రెడ్డిని అభినందించారు.మాల్ ఎండిలు హరికేష్, సంయుక్తరాణి, కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## శాస్త్రోక్తంగా సరస్వతీదేవి విగ్రహ ప్రతిష్ట

తొట్టంబేడు, ఆగస్టు 22 ప్రభాతవార్త



పట్టణంలోని ఎస్వీఏ జూనియర్ బాలుర కళాశాలలో ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి దంపతులు సరస్వతీ దేవి విగ్రహాన్ని ప్రతిష్టాపన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈనెలలో పదవీ విమరణ చేస్తున్న ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి తాను పనిచేసిన కళాశాలలో గుర్తుగా ఉండేందుకు చదువుల తల్లి సరస్వతీదేవి విగ్రహాన్ని ఏర్పాటు చేయించారు. గురువారం కళాశాల అద్యాపకులు, విద్యార్థుల మధ్య విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం శాస్త్రోక్తంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ వేణుగోపాల్‌రెడ్డి దంపతులతో పాటు, వరదయ్యపాళెం కళాశాల ప్రిన్సిపల్ పద్మావతి, సీనియర్ అధ్యాపకులు చెంచుకృష్ణారెడ్డి, వెంకటకృష్ణ, భారతీ, రాధ, నాన్ టీచింగ్ అసోసియేషన్ అధ్యక్షులు విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాన పథకానికి టమోటాల విరాళం



**శ్రీకాళహస్తి, ఆగస్టు 22 ప్రభాతవార్త** శ్రీకాళహస్తీశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదాన పథకానికి పుంగనూరు వాస్తవ్యులు మోహన్‌యాదవ్, మల్లియాదవ్, మనోహర్ భక్తులు సుమారు లక్ష విలువ చేసే మూడు టన్నుల టమోటాలును దేవస్థానం ఇఓ ఎన్‌వివిఎస్‌మూర్తికి విరాళంగా అందించారు. ఈసందర్భంగా దాతలకు స్వామిఅమ్మవార్ల దర్శనంతోపాటు తీర్థప్రసాదాలను అందించారు.

## 25నుండి ప్రతిరోజూ జీతెలుగులో సీరియల్స్

తిరుపతిటౌన్,ఆగస్ట్ 22ప్రభాతవార్త:




తెలుగుప్రేక్షకులకుఅంతులేని వినోదం కలిగిస్తున్న జీ తెలుగు మరో ప్రత్యేకతతో ప్రేక్షకుల ముందుకు వస్తోంది. ప్రేక్షకుల ఆదరాభిమానాలతో విజయవంతంగా కొనసాగుతున్న సీరియల్స్‌ను ఇకనుండి ఆదివారం కూడా ప్రసారం చేయడానికి సిద్ధమైందని ప్రతినిధి ప్రసాద్‌గుప్త తెలిపారు. సోమవారం నుండి శనివారం వరకు సాయంత్రం 6గంటల నుండి రాత్రి 9గంటలవరకు ప్రసార అయ్యే సీరియల్స్ అన్నీ ఈనెల 25 నుండి ఆదివారం కూడా ప్రసారమవుతాయని తెలిపారు. ఈ సీరియల్స్ తమ అభిమానులను ఎంతగానో ఆకట్టుకుంటుండటంతో చిరంజీవిలక్ష్మీసౌభాగ్యవతి, మేఘసందేశం, పడమటి సంధ్యారాగం, త్రినయని,మా అన్నయ్య, నిండునూరేళ్ళ సావాసం ఈ ఆరు సీరియల్స్ ఇకనుండి ప్రతిరోజూ ప్రేక్షకులను అలరించనున్నాయి.

## శ్రీవారి సన్నిధిలో

కాణిపాకం ఆలయ ఈఓ వాణి



తిరుమల,ఆగస్ట్ 22ప్రభాతవార్తప్రతినిధి:

సత్యప్రమాణాల కాణిపాకం వినాయక ఆలయం ఈఓ కె.వాణి గురువారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ అధికారులు ఆమెకు దర్శనం చేయించి తీర్థప్రసాదాలు అందజేశారు.

## పుంగనూరులో అడల్డ్ డ్రైవింగ్‌పై చర్యలు అవసరం

పుంగనూరు,ఆగస్టు 22 ప్రభాతవార్త



పట్టణంలో ట్రాఫిక్ సమస్యలు అధికంగా ఉన్నాయని.చిన్నపిల్లలకు కూడా వాహనాలు నడుపుతున్నారని, ద్విచక్రవాహనాలతో పాటూ ఆటోలు నడపడంతో ఎటువంటి రికార్డులు లేకుండా మైనర్లు సైతం పాల్గొంటున్నారి విశ్రుంత డిఎస్పీ, రాష్ట్ర వాల్మీకి సంఘ అధ్యక్షుడు సుకుమార్‌బాబు మంత్రి రాంప్రసాద్‌రెడ్డికి ఫిరా ్యదుచేశారు. గురువారం పుంగనూరు ఇన్‌చార్జి చల్లాబాబును మర్యాదపూర్వ కంగా కలసిన అనంతరం సుకుమార్‌బాబు వీరిరువురికీ పట్టణంలో ప్రధానంగా ఉన్న ఈసమస్యను వివరించారు. దీనితో పాటూ పట్టణ,గ్రామీణ ప్రాంతాలలో ఇంకా దేశం మద్దతుదారులపై కక్ష్యసాధింపు చర్యలు బాహాటంగానే సాగుతున్నాయని, శికారీ పాలెంకు చెందిన శికారీల భూములపై అక్కడి పెత్తందారుల దౌర్జన్యాలు ఆగడంలేదని తెలిపారు. శికారీల సమస్యలపై వారు పోలీసులను,రెవిన్యూ అధికారులను కలసి పరిష్కరించాలని కోరిన రోజే దారికాచి ఎలా బతుకుతారో చూస్తామంటూ ప్రత్యర్థులు శికారీలను బెదిరించారని, వారికి ప్రాణహానీ ఉందని తమతో

## తహసీల్దార్ కార్యాలయానికి నాయకుల చిత్రపటాలు పంపిణీ



విజయపురం, ఆగస్టు 22 ప్రభాతవార్త: విజయపురం తహసీల్దార్ కార్యాలయానికి క్షురికాపురం టీడీపీ పార్టీ అధ్యక్షుడు గజేంద్రనాయుడు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ చిత్రపటాలను మండల టీడీపీ పార్టీ ప్రెసిడెంట్ రమేష్‌రాజు ద్వారాపంపిణీ చేశారు. ఇందులో క్షురికాపురం సర్పంచ్ శేఖర్, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవు

నగరి, ఆగస్టు 22 ప్రభాతవార్త:



ఆస్తుల రిజిస్ట్రేషన్ ప్రక్రియలో అధికారులు అవకతవకలకు పాల్పడినట్లు తన దృష్టికి వస్తే చర్యలు తప్పవని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సబ్ రిజిస్ట్రార్, తహసీల్దార్‌లను హెచ్చరించారు. గురువారం సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి చేరుకున్న ఆయన సబ్ రిజిస్ట్రేషన్ సుబ్రహ్మణ్యం, తహసీల్దార్ రవికుమార్‌లతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తరచూ రిజిస్ట్రేషన్ల వ్యవహారాలకు సంబంధించి ఫిర్యాదులు అందుతున్నాయని అందుకే ప్రత్యక్షంగా కార్యాలయానికి విచ్చేయడం జరిగిందన్నారు. అమల్లో లేని నిబంధనలతో రిజిస్ట్రేషన్‌కు వచ్చేవారిని ఎలాంటి ఇబ్బందులకు గురి చేయకూడదన్నారు. ఎమ్మెల్యే పేరు చెప్పికాని, స్థానిక అధికారుల పేరు చెప్పి కాని వసూళ్ళకు పాల్పడకూడదన్నారు. అలా చేస్తే చర్యలు తప్పవని ఇకపై ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూసుకోవాలని సూచించారు. కార్యాక్రమంలో స్థానిక నాయకులు రమేష్, జ్యోతినాయుడు, గుణశేఖర్, శ్రీనివాసులురెడ్డి, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

## నేడు జరిగే గ్రామసభలకు అందరూ హాజరు కావాలి - ఎమ్మెల్యే పిలుపు

పిచ్చాటూరు, ఆగస్టు 22 ప్రభాతవార్త:

నేడు శుక్రవారం అన్ని పంచాయతీల్లో నిర్వహించే గ్రామసభలకు అధికారులు, ప్రజాప్రతినిధులతో పాటు కూటమి పార్టీలకు చెందిన అన్ని కేడర్ నాయకులు, కార్యకర్తలు తప్పక హాజరు కావాలని ఎమ్మెల్యే ఆదిమూలం పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆయా పంచాయతీల్లో 2024-25 ఆర్థిక సంవత్సరంలో చేపట్టదలచిన అభివృద్ధి పనులను ఎంపిక చేసి గ్రామసభలో పంచాయతీ తీర్మానం చేయబడుతుందన్నారు. తమ గ్రామ అభివృద్ధికి అవసరమైన సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులతో పాటు ఇతర మౌళిక వసతులు కల్పనకు అవసరమైన పనులను ఈ గ్రామసభలో ప్రతిపాదించి తీర్మానం చేయవచ్చని ఎమ్మెల్యే వివరించారు.

## ఆరోగ్య సూత్రాలను పాటించి వ్యాధులపై విజయం సాధించండి

- వైద్యాధికారి దివాకర్

**బుచ్చినాయుడు కండ్రిగ, ఆగస్టు 22 ప్రభాతవార్త:** పరిసరాలు వాతావరణ విషయాలను పరిగణలకు తీసుకుని సమయాలకుగా సూత్రాలను పాటిస్తే దాదాపు ఇటువంటి సీజన్ వ్యాధుల భారీ పడకుండా జాగ్రత్త పడవచ్చు అని వైద్యాధికారి డా. దివాకర్ తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని అక్షర పాఠశాలలో సీజన్ జ్వరాల వాతావరణ పరిస్థితులపై అవగాహన కల్పించేందుకు స్థానిక మండల కేంద్రంలోని అక్షర పాఠశాలలో డా. దివాకర్ ఆరోగ్య సిబ్బంది సహకారంతో పరిశీలించారు. అక్కడ బిల్డింగ్ వాతావరణం, తరగతి గదుల సౌకర్యం, భోజన వసతుల వంటగదిపరిసరాలు, స్త్రీలకు, పురుషులకు సంబంధించి మరుగు వసతులు పర్యవేక్షించి అద్భుతంగా ఉందని తెలియజేశారు. ఒక ప్రైవేటు పాఠశాలలన్ని ఇటువంటి వసతులు ఉన్నప్పుడు వసతులు కోసం ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ వసతి గృహాల్లోఎందుకు మెరుగైన వసతులు లేకపోవడం బాధాకరమన్నారు. మన ఇల్లు పరిసరాలతో పాటు తన చుట్టూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నప్పుడే సీజన్ వ్యాధులను అరికట్టడం సాధ్యపడుతుందని తెలిపారు.దోమలు అభివృద్ధి చెందడానికి మనమే అవకాశం కల్పిస్తున్నాం మన చుట్టూ పరిసరాలను ఉంచు కలిగినప్పుడే ఇటువంటి రోగాలు రాకుండా నివారించే పరిస్థితులు నెలకుంటాయని సూచించారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అక్షర స్కూలు డైరెక్టర్ ప్రతాప్ పాల్గొన్నారు.

## ఎన్‌జి రంగా వ్యవసాయ వర్సిటీలో పార్థీనియం కలుపు మొక్కల నివారణ వారోత్సవాలు

తిరుపతి విద్య, ఆగస్టు 22, ప్రభాతవార్త



ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ వర్సిటీ, వ్యవసాయ పాలిటెక్నిక్, తిరుపతి, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం, తిరుపతి నందు పార్థీనియం కలుపు మొక్క నివారణ వారోత్సవాలల్లో భాగంగా విద్యార్థులు, సిబ్బంది పార్థీనియం కలుపు మొక్క వలన వచ్చే నష్టాలు, నివారణ చర్యలను ప్రదర్శిస్తూ ర్యాలీ చేయడం జరిగిందన్నారు. తదుపరి పరిసరాళ్ళల్లో వున్నా పార్థీనియం కలుపు మొక్కలు పీకివేసి కార్చడం జరిగింది. ఈ కార్యక్రమంలో సహ పరిశోధన సంచాలకులు డా.వి. సుమతి పాలుపంచుకొని ర్యాలీ, మొక్కలు పీకు కార్యక్రమాల్లో పాల్గొనడం జరిగింది. వ్యవసాయ పాలిటెక్నిక్ సిబ్బంది సహజ, మదన్ మోహన్, హారతి పాల్గొనగా పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు సుధాకర్, ప్రసాద్, లతా, విశ్వనాధ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉత్కర్ష మహోత్సవంలో పాల్గొన్న సంస్కృత వర్సిటీ వైస్ ఛాన్సలర్ కృష్ణమూర్తి



**తిరుపతి విద్య, ఆగస్టు 22, ప్రభాతవార్త** కేంద్రీయ సంస్కృత వర్సిటీ న్యూఢిల్లీ, జాతీయ సంస్కృత వర్సిటీ తిరుపతి, శ్రీ లాల్ బహుదూర్ శాస్త్రీ జాతీయ సంస్కృత వర్సిటీ న్యూఢిల్లీ ఈ మూడు విశ్వవిద్యాలయ హోదా ఇచ్చిన తర్వాత మూడు విశ్వవిద్యాలయాల వికాసం కొరకు ప్రతి సంవత్సరం నిర్వహిస్తున్న ఉత్కర్ష కార్యక్రమం ఈసారి శ్రీ లాల్ బహుదూర్ శాస్త్రి జాతీయ సంస్కృత విశ్వవిద్యాలయం న్యూఢిల్లీలో ఘనంగా గురువారం ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమానికి తిరుపతి వర్సిటీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఆర్ కృష్ణమూర్తి విశ్వవిద్యాలయ అధ్యాపక బృందంతో కలిసి వెళ్లి పాల్గొనడం జరిగింది. ఈ ప్రారంభోత్సవంలో పద్మశ్రీ అవార్డు గ్రహీత, భారతీయ భాషా సమితి అధ్యక్షులు చమ్ము కృష్ణశాస్త్రి, భారత ప్రభుత్వ టెక్స్టైల్ మినిస్టర్ గిరిరాజ్ సింగ్ కార్యక్రమానికి విచ్చేయడం జరిగింది. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ప్రగతిని వారి సమక్షంలో వివరించారు. సంస్కృత భాషాభివృద్ధికి విశ్వవిద్యాలయం తరపున చేస్తున్న విశేష కృషిని ఆయన వివరించడం జరిగింది.

## శ్రీ పద్మావతి మహిళా వర్సిటీలో

నేను మీకు తెలుసా అనే అవగాహన కార్యక్రమం

తిరుపతి విద్య, ఆగస్టు 22, ప్రభాతవార్త



వే ఫౌండేషన్, ఎన్ఎస్ఎస్ బ్యూరో శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో నేను మీకు తెలుసా అనే అవగాహన కార్యక్రమం గురువారం ఏర్పాటు చేయడం జరిగింది. ప్రభుత్వ శాఖలకు సంబంధించిన టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ నెంబర్లను సేవలను విద్యార్థినులకు తెలియజేయడానికి ఆర్పిఎఫ్ డిపార్ట్మెంట్ నుంచి సర్కిల్ మునిశంకర్ రెడ్డి పాల్గొని మాట్లాడుతూ ఇంట్లో గ్యాస్ వల్ల అగ్ని ప్రమాదం, నీళ్లలో ప్రమాదం జరిగినప్పుడు మనల్ని మనం ఎలా కాపాడుకోవాలో లైవ్ డెమోతో తెలియజేశారు. రుయా హాస్పిటల్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మానస మాట్లాడుతూ విద్యార్థినులు డ్రగ్స్‌కు బానిసలు అయినందువలన ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. మానస్ హాస్పిటల్ నుండి సైకిఆర్టిస్ట్ డాక్టర్ కిషోర్ కుమార్, సైబర్ క్రైమ్ నుండి సీనియర్ కానిస్టేబుల్ సి.లక్ష్మీ నారాయణ మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీలలో సైబర్ నేరాలు మోసాల భారి నుండి ఎక్కడికి ఎళ్ళకుండా ఒక్క ఫోన్ కాల్‌తో మనల్ని మనం ఎలా కాపాడుకోవాలో తెలియజేశారు. 100, 108, 104, 181, 112, 101, 1098, 139, 1930 ఈ టోల్ ఫ్రీ నెంబర్లకు సంబంధించి విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ ఆచార్య ఎం. విద్యావతి, ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ యువశ్రీ, డాక్టర్ మాధురి, డాక్టర్ సుజాత, వజిహ భాను, డాక్టర్ భార్గవి విద్యార్థినులు పాల్గొన్నారు.

## వాడవాడల్లో చిరుజన్మదిన వేడుకలు: పేదలకు అన్నదానాలు

శ్రీకాళహస్తి,ఆగస్టు 22 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలోని వాడ వాడల్లో మెగాస్టార్ చిరంజీవి జన్మదిన వేడుకలను అభిమానులు, జనసేన పార్టీ నాయకులు, కాపునాయకులు,కాపు సంక్షేమ సంఘ నాయకులు వేర్వేరుగా సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించారు. జనసేనపార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి వినూత కోట పెండ్లి మండపం,ఆర్‌టిసి బస్టాండు సర్కిల్ వద్ద మెగా జన్మదిన వేడుకల సందర్భంగా పెద్ద ఫ్లెక్సీలను ఏర్పాటు చేసారు.అలాగే నిరుపేదలు వేలాది మందికి భోజన వసతి కల్పించారు. ఈకార్యక్రమాల్లో పేట చంద్రశేఖర్, తోట గణేష్,చంద్రబాబు కోటల సారథ్యంలో కార్యకర్తలు భారీ ఎత్తున కార్యక్రమాలు నిర్వహించారు.కొత్త పేట కార్గిల్ సర్కిల్ వద్ద ఉన్న వినాయక గుడి వద్ద కాపుసంక్షేమ నియోజకవర్గ అధ్యక్షులు అరిగెల వేణుగోపాల్‌నాయుడు, కొట్టే సాయి, పసుపులేటి నవీన్ కుమార్, రాధరంగ మిత్రమండలి పట్టణ అధ్యక్షుడు పగడాల ప్రతాప్,శ్రీపురం సుధాకర్,పగడాల సుధాకర్, సిద్దులు గారి ప్రసాద్,స్వర్ణమూర్తి,కొండేటి గోపాల్,సుబ్బరామయ్య,గరికపాటిరాధాకృష్ణ,రాజా,సాయి వేదశ్రీ సారథ్యంలోచిరంజీవి జన్మదిన వేడుకలనుఘనంగా నిర్వహించారు.భారీఎత్తునఫ్లెక్సీలు ఏర్పాటు చేసారు.

## నూతన సిఐలు బాధ్యతలు స్వీకరణ

శ్రీకాళహస్తి/శ్రీకాళహస్తిరూరల్/తొట్టంబేడు, ఆగస్టు 22 ప్రభాతవార్త



ఎన్నికల విధులు నిర్వహించడానికి విచ్చేసిన పోలీసు సిబ్బంది తమ తమ ప్రాంతాలకు వెళ్తున్నారు. ప్రభుత్వం బదిలీల ప్రక్రియ చేపట్టడంతో పోలీసులు బదిలీ అవుతున్నారు. శ్రీకాళహస్తి రెండో పట్టణ సిఐగా తిరుపతిలోని సిసిఎస్ పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న సి.వెంకటే శ్వర్లు బాధ్యతలు స్వీకరించారు. ఇక బుచ్చినాయుడుకండ్రిగ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా గతంలో శ్రీకాళ హస్తి అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐగా పనిచేసి సిఐగా పదోన్నతి పొందిన తిమ్మయ్యను నియ మించారు. ఇక రూరల్ సిఐగా తిరుపతి సిఐడిలో విభాగంలో పనిచేస్తున్న ఎం.రవినాయక్‌ను నియమిం చారు.వీరు గురువారం శ్రీకాళహస్తీశ్వరున్ని దర్శించుకుని బాధ్యతలు చేపట్టారు. శివయ్య సన్నిధిలో పనిచేయడం తమ అదృష్టమన్నారు. శాంతిభద్రతలకు ఎలాంటి విఘాతం కలిగించినా సహించేది లేదని తెలిపారు.

# తిరుపతి డివిజన్

## అవినీతి రహిత పరిపాలన జరగాలి

ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్



పుత్తూరు, ఆగస్టు 22 ప్రభాతవార్త :

ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి రహిత పరిపాలన జరగాలని ఎమ్మెల్యే గాలి భానుప్రకాశ్ అన్నారు. గురువారం పుత్తూరు, నగరి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నగరి నియోజకవర్గంలోని ప్రభుత్వ కార్యాలయాల్లో తన పేరిట ఎవరు వసూళ్లకు పాల్పడినా సహించేది లేదని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజలు దీనిని గ్రహించాలన్నారు. ప్రజలకు సేవ చేయడానికే ప్రభుత్వ కార్యాలయాలు వున్నాయని తెలిపారు. గుంట పోరంబోకు భూములు, సరైన రికార్డులు లేని భూములను రిజిస్ట్రేషన్ చేయవద్దన్నారు. అదే సమయంలో సక్రమంగా రికార్డ్ వున్నప్పటికీ రిజిస్ట్రేషన్ చేయకుండా ప్రజలను ఆఫీసుల చుట్టూ తిప్పించుకోవడం కరెక్ట్ కాదని హితవు పలికారు. పుత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రికార్డ్ రూమ్ పాడైన విషయాన్ని రిజిస్ట్రార్ యోగానంద్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. అధికారులు ప్రతిపాదనలు తయారుచేస్తే కలెక్టర్‌కు చెప్పి నూతన భవనాన్ని మంజూరు చేయిస్తానని తెలిపారు. తనిఖీల్లో తహశీల్దారు వెంకటేశ్వర్లు, నగరి సబ్ రిజిస్ట్రార్ సుబ్రమణ్యం, కార్యాలయ సిబ్బంది, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## సత్యవేడు ప్రింట్‌మీడియా నూతన కార్యవర్గం

**సత్యవేడు,ఆగస్టు 22,ప్రభాతవార్త:** తిరుపతి జిల్లా సత్యవేడు ప్రింట్ మీడియా అసోసియేషన్ అధ్యక్ష్యులుగా రామచంద్రయ్య, గౌరవ అధ్యక్ష్యులుగాశ్రీనివాసరావు, ఉపాధ్యాక్ష్యులుగా నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా సోమురెడ్డి, సభ్యులుగా సలీమ్ ఎన్నికయ్యారు. గురువారం ప్రెస్‌క్లబ్ అసోషియేషన్‌సభ్యుల సమావేశం జరిగింది.ఈనేపధ్యంలో నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ప్రింట్ మీడియా అధ్యక్ష్యులు రామచంద్రయ్య మాట్లాడుతూ ప్రింట్ మీడియా అసోషియేషన్ బలోపేతానికి కృషి చేయడంతో పాటు ప్రజా సమస్యలను పత్రికా ముఖంగా వెలుగులోకి తీసుకుని వచ్చిఅధికారుల సహకారంతో పరిష్కరించడం జరగుతుందన్నారు

## ఐతేపల్లిలో వ్యక్తి ఆత్మహత్య

చంద్రగిరి, ఆగస్టు 22 ప్రభాతవార్త:

మండల పరిధిలోని ఐతేపల్లిలో వ్యక్తి ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల మేరకు.. తమిళనాడుకు చెందిన వలస కూలీ బాల (33) రెండేళ్ళ క్రితం తన భార్యతో కలసి ఐతేపల్లి చేరుకున్నారు. జీవనాదారం కోసం సుమో డ్రైవర్‌గా వెళుతుండగా, భార్య రోజూ వారీ కూలీ పనులకు వెళుతున్నది. ఆర్థిక ఇబ్బందులా, కుటుంబ కలహాలా, మరే ఇతర సమస్యలో తెలియదు కానీ సచివాలయం సమీపంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. దీంతో గ్రామంలో విషాధఛాయలు అలుముకున్నాయి. సిఐ రామయ్య ఆదేశాల మేరకు ఎస్ఐ అనిత తమ సిబ్బందితో సంఘటనా స్థలికి చేరుకుని వివరాలను సేకరించి, కేసు విచారణ చేపట్టారు.

## మానికొండ తులశమ్మకు పులివర్తి నాని నివాళి

చంద్రగిరి, ఆగస్టు 22 ప్రభాతవార్త:



బుచ్చినాయుడు పల్లికి చెందిన మాజీ డి.ఇ మానికొండ రామ్మూర్తి భార్య మానికొండ తులశమ్మ చిత్రపటానికి ఎంఎల్ఏ పులివర్తి నాని పుష్పాంజలి ఘటించారు. గురువారం తులశమ్మ కర్మక్రియలకు హాజరైన ఎంఎల్ఏ మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆయన వెంట పార్టీ నాయకులు వున్నారు.

## రాస్ ఆధ్వర్యంలో ఉచిత మెగా పశు వైద్యశిబిరం



**రేణిగుంట, ఆగస్టు 22 ప్రభాతవార్త:** రేణిగుంట మండలం ఆర్ అగ్రహారం గ్రామంలో, రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్టు ఆధ్వర్యంలో గురువారం ఉచిత మెగా పశు వైద్య శిబిరం జరిగింది. అగ్రహారం, పరిసర గ్రామాల్లోని రైతులకు సంబంధించిన అన్ని పశువులకు, జీవాలకు, రేణిగుంట ఏరియా వెటర్నరీ, అసిస్టెంట్ డైరెక్టర్ సునీత బృందం సహకారంతో నిర్వహించిన ఉచిత పశు వైద్య శిబిరానికి విశేషమైన స్పందన లభించింది. శిబిరానికి తీసుకొచ్చిన అన్ని పశువులకు, దూడలకు, జీవాలకు ఎటువంటి సమస్యలు వస్తున్నాయి. వాటి నివారణోపాయాలు, వీటికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను అవగాహన కల్పించారు. ఆరోగ్యపరంగా అన్ని తనిఖీలు చేసి తగిన సూదులు, మందులు ఉచితంగా ఇచ్చారు. దీంతో పాటు వచ్చిన ప్రతి పశువుకి, జీవానికి పురుగుల మందు తాగించడం, పిడుదులకు సంబంధించి మందును స్ప్రే చేశారు. కార్యక్రమంలో ఏరియా వెటర్నరీ డా. స్రవంతి, ట్రస్టీ సుబ్బరత్నమ్మ, ట్రస్టు సిబ్బంది గిరిప్రసాద్, ఇందుమతి, అన్బలగన్, స్వాతి, శంకరయ్య, గోపాల మిత్రలు, ముని, లోకేష్, క్లస్టర్ లీడర్లు, రైతులు పాల్గొన్నారు.

## పద్మ విభూషణన్ చిరంజీవికి ఘనంగా జన్మదిన శుభాకాంక్షలు



**రేణిగుంట, ఆగస్టు 22 ప్రభాతవార్త:** మాజీ కేంద్ర మంత్రి, ప్రముఖ సినీ నటుడు పద్మ విభూషణన్ కొణిదల చిరంజీవికి గురువారం శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోట వినుత పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. తిరుపతిలోని ఓ గెస్ట్‌హౌస్‌లో ఆయనను కలసి సత్కరించి తమ అభిమానాన్ని చాటుకున్నారు. శ్రీవారి దర్శనం ముగించుకుని వచ్చిన ఆయన కుటుంబానికి ఘనంగా వీడ్కోలు పలికారు. కోటా వినుతతో పాటు కోటా చంద్రబాబు నాయుడు, పలువురు జనసేన నాయకులు పవన్‌కల్యాణ్, చిరంజీవి, అభిమానులు పాల్గొన్నారు.

## శ్రీద్రౌపదీ ధర్మరాజస్వామి సేవలో

మండల టిడిపి నాయకులు



**ఏర్పేడు, ఆగస్టు22,ప్రభాతవార్త;** మండలంలోని పాపానాయుడుపేట గ్రామంలో వెలసిన శ్రీద్రౌపదీ సమేత ధర్మరాజ స్వామి వారిని గురువారం మాజీ సడ్పీటీసి సభ్యులు పేరం ధనంజయుల నాయుడు, భాపూజి విద్యాసంస్థ అధినేత వేమూరి బాలాజి నాయుడు, గుడిమల్లం ఆలయ ఛైర్మెన్ బత్తల గిరిబాబు నాయుడు, మండల తెలుగు యువత అధ్యక్షులు పేరం నాగరాజునాయుడు స్వామి అమ్మ వార్లను దర్శించుకొన్నారు. ఈసందర్భంగా ఆలయ మర్యాదల ప్రకారం ఆలయ కమిటీ సభ్యులు వారికి ఘనస్వాగతం పలికి పూలమాలలు వేసి దుశ్శాలువలతో సత్కరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా మళ్లీ పూర్వ వైభవం సంతరించుకోవాలని ఆలయ పూజారులు ఆశీర్వాదం చేశారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, చేనేత సంఘం వారు, అర్జున్‌బాబు, క్రిష్ణప్ప మొదలి తదితరులు పాల్గొన్నారు.

## నేడు ఉపాధిహామీ గ్రామసభలు

కొత్త పనులకు శ్రీకారం

**ఏర్పేడు, ఆగస్టు22, ప్రభాతవార్త;** మండలంలోని అన్ని పంచాయతీల్లో శుక్రవారం గ్రామ సభలు నిర్వహించ నున్నట్లు ఎంపీడీవో గిద్దయ్య ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 2024-25 సంవత్సరంలో చేపట్టే పనులకు సంబంధించిన పనుల ప్రణాళికలను రూపొందించాలని ఆయన పేర్కొన్నారు.

## వైభవంగా సంకటహర చతుర్థి

పుత్తూరురూరల్, ఆగస్టు 22 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణం మండల పరిధిలోని పలు వినాయకస్వామి ఆలయాల్లో సంకటహర చతుర్థి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని బెస్తవీధిలో వెలసిన శ్రీ తరుణ గణపతి ఆలయంలో సంకటహర చతుర్థి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో మూల ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు, అలంకరణలు చేశారు. ఆలయ ఆవరణలోని సూర్యభగవానుడు, శ్రీ సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాలు కూడా అభిషేకాలు చేశారు. సాయంత్రం ఆలయ ఆవరణలో గణపతి హోమం నవగ్రహ హోమం, నవగ్రహ పూజ ప్రత్యేక హోమాలు చేశారు. అలాగే జెండామాను వీధిలోని సెల్వ గణపతి ఆలయం, బజారు వీధిలోని వరసిద్ధి వినాయకస్వామి ఆలయం, మండల పరిధిలోని తొరూరు గ్రామంలో వెలసిన శ్రీ వరసిద్ధి వినాయకస్వామి ఆలయంలో కూడా స్వామివారికి అభిషేకం అలంకరణలు చేశారు. అనంతరం స్వామివారికి భక్తులు కర్పూర నీరాజనలు అర్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు.

## బీఎన్‌కే ఎస్ఐగా విశ్వనాథ్ నాయుడు బాధ్యతల స్వీకరణ



**బుచ్చినాయుడు కండ్రిగ, ఆగస్టు 22 ప్రభాతవార్త:** బుచ్చినాయుడు కండ్రిగ పోలీస్‌స్టేషన్ ఎస్ఐగా విశ్వనాథనాయుడు బాధ్యతలు తీసుకున్నారు. బాధ్యత తీసుకున్న ఆయనకు పోలీసు సిబ్బంది స్వాగతం పలికారు.

## పాఠశాల అభివృద్ధికి సహకరించాలి

విజయపురం, ఆగస్టు 22 ప్రభాతవార్త:



పాఠశాల అభివృద్ధికి కొత్తగా ఎన్నికైన పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు సహకరించాలని ప్రధానోపాధ్యా యులు జ్ఞానప్రసాద్ కోరారు. గురువారం మండలం లోని శ్రీహరిపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో కొత్తగా ఎన్నికైన కమిటీ ఛైర్మన్ సురేష్‌రాజు, వైస్ ఛైర్మన్ ఐలవతిలను ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దాత చెంచురాజు, విజయ చంద్రిక, సునీత, రాధాకుమారి, వెంకటేష్, గోపి, విజయకుమార్, విజయవర్మ, వెంకమ్మరాజు, తదితర ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# కాణిపాకంలో వైభవంగా సంకటహర గణపతివ్రతం



కాణిపాకం, ఆగస్టు 22 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో గురువారం సంకటహర గణపతివ్రతంను అత్యంత వైభవోపేతంగా నిర్వహించారు. ఆలయంలో ప్రతినెలా పౌర్ణమి అనంతరం చతుర్థి రోజున ఈవ్రతంను నిర్వహించడం ఆనవాయితీ. ఈమేరకు దేవస్థానం ఆస్థాన మండపంలో అర్చకులు ఈ వ్రతాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ప్రధాన ఆలయం నుండి అలంకరించిన సిద్ధి బుద్ధి సమేత గణనాథుని ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ స్థానిక ఆస్థాన మండపంకు తీసుకువచ్చి వుంచి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణ నడుమ అర్చకులు వ్రతాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఉదయం 11 గంటలకు, సాయంత్రం 5 గంటలకు రెండు దఫాలుగా ఈవ్రతాన్ని నిర్వహించారు. వ్రతంలో పాల్గొన్న భక్తులకు దేవస్థానం తరపున తీర్థప్రసాదములను అందజేశారు. పవిత్రమైన సంకటహర చతుర్థి వ్రతం నిర్వహించు కోవడానికి వివిధ ప్రాంతాల నుండి భక్తులు భారీగా తరలిరావడంతో ఆస్థాన మండపం కిక్కిరిసింది.రికార్డు స్థాయిలో సంకటహర వ్రతంకు 717 టిక్కెట్లు తీసుకుని వత్రాన్ని అచరించారు. దీనితో ఆలయ అధికారులు, సిబ్బంది భక్తులకు కావలసిన ఏర్పాట్లు చేపట్టారు. ఈకార్యక్రమంలో ఆలయ ఈఓ కె.వాణి, ఏఈఓ విద్యాసాగర్‌రెడ్డి, సూపరెండెంట్లు వాసు, కోదండపాణి, టెంపుల్ ఇన్స్‌పెక్టర్ రవి, వేదపండితులు, వివిధ ప్రాంతాల నుండి వచ్చిన భక్తులు పాల్గొన్నారు.

## సాంప్రదాయబద్ధంగా పోలేరమ్మ జాతర : ఎమ్మెల్యే



వెంకటగిరి, ఆగస్టు 22 ప్రభాతవార్త : సెప్టెంబర్ నెల 25, 26 తేదీల్లో జరగబోవు వెంకటగిరి గ్రామ శక్తి స్వరూపిణి పోలేరమ్మ జాతరను సాంప్రదాయ బద్ధంగా నిర్వహిస్తామని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. వెంకటగిరి పట్టణంలోని పోలేరమ్మ గుడి, కాంపాలెం వద్ద ఉన్న గాలి గంగమ్మల మండపం ప్రాంతంలో జాతర ఏర్పాట్లను ఎమ్మెల్యే పరిశీలించారు. జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం లేకుండా చర్యలు తీసుకుం టామని చెప్పారు. ముఖ్యంగా తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపడతామని చెప్పారు. గతంలో జాతర సాంప్రదాయ బద్ధంగా కాకుండా ఇష్టారాజ్యంగా చేసేవారని తెలిపారు. ఆయన వెంట మాజీ ఏఎంసి చైర్మన్ రాజేశ్వరరావు, రాష్ట్ర తెలుగు యువత కార్యదర్శి కెవికె ప్రసాద్ నాయుడు, మున్సిపల్ వైస్ చైర్మన్ రాజేశ్వర రావు, మాజీ కౌన్సిలర్ విశ్వనాథం, నరసింహులు, రామకృష్ణ, సుధాకర్, ఆనంద్ తాళ్లూరు చంద్ర, సానిటరీ ఇన్స్పెక్టర్ రామారావు తదితరులు ఉన్నారు.

## వెంకన్న దర్శనంతో సంతోషం

**-పుట్టినరోజు చిరంజీవి కుటుంబంతో పరవశం**



తిరుమల,ఆగస్ట 22ప్రభాతవార్తప్రతినిధి: సినీనటుడు, మాజీకేంద్రమంత్రి పద్మవిభూషణ్ చిరంజీవి పుట్టిన రోజును గురువారం వేకువజామున శ్రీవేంకటేశ్వర స్వామి సన్నిధిలో జరుపుకున్నారు. వేకువ జామున నటుడు చిరంజీవి, తల్లి అంజనాదేవి, సతీమణి సురేఖ, కుమార్తె శ్రీజ, మనవరాళ్ళతో కలసి ఆలయం లోనికి చేరుకుని స్వామివారి సుప్రభాతసేవలో పాల్గొన్నారు. ఆలయ అధికారులు దర్శనం చేయించి స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపలకు వచ్చిన చిరంజీవిని చూసేందుకు భారీగా అభిమానులు ఎగబడ్డారు. తిరుమల డిఎస్పీ విజయశేఖర్,1టౌన్ సిఐ విజయ కుమార్, 2టౌన్ సిఐ సత్యనారాయణ గట్టి భద్రత కల్పించారు.

# నేడు ఘనంగా జాతీయ స్పేస్ దినోత్సవం

**- దేశ రాజధానిలో పలువురు ప్రముఖులు పాల్గొనే అవకాశం - ఇస్రో కేంద్రాలతో పాటు పలుచోట్ల కార్యక్రమాలు**



శ్రీహరికోట (తడ), ఆగస్టు 22 ప్రభాతవార్త : భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చంద్రయాన్-3 ప్రయోగ విజయాన్ని జాతీయ స్పేస్ దినోత్సవంగా ప్రకటించిన తర్వాత ఇప్పటికే వాడవాడలా విజయోత్సవాలు నిర్వహించారు. సరిగ్గా గత ఏడాది ఆగస్టు 23న చంద్రయాన్-3లోని ల్యాండర్, రోవర్‌లు చంద్రుని దక్షిణ ధ్రువంపై కాలుమోపిన సమయం గుర్తుంచుకొని జాతీయ స్పేస్ దినోత్సవాన్ని ప్రధాని మోడీ ప్రకటించారు. అనంతరం పార్లమెంటుకు ఎన్నికలు జరగడం, తిరిగి మోడీ ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వం కొలువుదీరడంతో భారత అంతరిక్ష పరిశోధనపై మరింత దృష్టి పెట్టారు. ఒకవైపు రాకెట్ ప్రయోగాలు, మరోవైపు గగన్‌యాన్ ఏర్పాట్లు, పరిశోధనలతో పాటు చంద్రయాన్-3 విజయోత్సవాలు నిర్వహించారు. సాధారణంగా ఇస్రో ఆధ్వర్యంలో అక్టోబర్ మాసంలో అంతరిక్ష వారోత్సవాలు నిర్వహిస్తారు. ఇది ప్రపంచ వ్యాప్తంగా జరిగే కార్యక్రమం అయితే మన సత్తా చంద్రుని దక్షిణ ధ్రువంపై చాటి చెప్పడంతో భారత అంతరిక్ష పరిశోధన తలెత్తుకొని తిరిగేలా చేసింది. ఈ రోజును గుర్తుంచుకొని శాస్త్రవేత్తలకు దేశమంతా సలాములు కొడుతూ విజయోత్సవాలు జరిపారు. ఇందుకోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసి ఆయా ఇస్రో కేంద్రాల డైరెక్టర్ల ఆధ్వర్యంలో ఎంపిక చేసిన పట్టణాలు, నగరాలు, విశ్వవిద్యాలయాల్లో దేశ వ్యాప్తంగా వందల కార్యక్రమాలు జరిపారు. శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ అంతరిక్ష కేంద్రంలోను ఈ కార్యక్రమాలను మరింత ఆసక్తిగా నిర్వహించారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను కూడా ఈ విజయోత్సవాలకు రప్పించారు. అయితే చివరి ఘట్టం శుక్రవారం జరగనుంది. న్యూఢిల్లీలో జరిగే ఈ కార్యక్రమా న్ని దేశ వ్యాప్తంగా వీక్షించే ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే రోజుకొక ఇస్రో గఘన విజయంపై ప్రత్యేక వీడియోలు రూపొందించి ఎక్స్‌లో ప్రచురిస్తున్నారు. ప్రపంచ వ్యాప్తంగా ఇస్రో సాధించిన విజయాలు శుక్రవారం ముగింపు సభతో మరింత వెలుగులోకి రానున్నాయి. అందుకనే శాస్త్రవేత్తలతో పాటు సామాన్యులు కూడా ఈ కార్యక్రమంపై ఆసక్తి చూపిస్తున్నారు.

## జిల్లాకు త్వరలో ప్రపంచస్థాయి కంపెనీలు : ఎమ్మెల్యే



చిత్తూరురూరల్, ఆగస్టు 22 ప్రభాతవార్త: చిత్తూరు జిల్లాకు ప్రపంచస్థాయి కంపెనీలు త్వరలో రాబోతు న్నాయనీ, ప్రతి విద్యార్థి, విద్యార్థినులు ఏకాగ్రతతో చదివి ఉద్యోగాలకు సిద్ధం కావాలని చిత్తూరు శాసన సభ్యులు గురజాల జగన్మోహన్ కోరారు. గురువారం నగరంలోని పివికెయన్ ప్రభుత్వ కళాశాల నందు నిర్వహించిన ఉద్యోగ మేళా కార్యక్రమానికి చిత్తూరు శాసనసభ్యులు గురజాల జగన్మోహన్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ముందుగా ఎన్‌సిసి విద్యార్థుల గౌరవ వందనం స్వీకరించి, జ్యోతిప్రజ్వలన నిర్వహించి ఉద్యోగమేళాను ప్రారంభించారు. చిత్తూరునియోజకవర్గంలోని నిరుద్యోగులకు ఉద్యోగ కల్పనకు జాబ్‌మేళా నిర్వహించడం కోసం విచ్చేసిన కంపెనీ ప్రతినిధులను అభినందించారు. ప్రతి విద్యార్థి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును ఆదర్శంగా తీసుకొని గ్లోబల్‌స్థాయి ఉద్యోగాలకు సంసిద్ధంగా కావాలని, ఇకపై ఉద్యోగాల కోసం ఇతర రాష్ట్రాలకు వలస పోవలసిన అవసరం రాదని, త్వరలో అందుకు అనువైన కంపెనీలు మన జిల్లాకు రానున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ అముద, కళాశాల ప్రిన్సిపాల్ జీవన్‌జ్యోతి, వైస్‌ప్రిన్సిపాల్ మీరాసాహెబ్, అధ్యాపకులు, వివిధ కంపెనీల ప్రతినిధులు, విద్యార్థిని, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత

**- ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ చైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ - అమరావతి కాలనీకి బస్సు సర్వీసు ప్రారంభం !!**



కుప్పం, ఆగస్టు 22 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు ఆదేశాల మేరకు కుప్పంలో ప్రజలకు మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. గురువారం కుప్పం మున్సిపల్ పరిధి డికెపల్లి, అమరావతి కాలనీకి నూతనంగా ఆర్టీసీ బస్సు సర్వీసును ఆయన ప్రారంభించి ప్రసంగించారు. అమరావతి కాలనీలో ప్రజలకు అవసరమైన విద్యుత్ లైన్లు ఏర్పాటుకు చర్యలు తీసుకుంటా మన్నారు. అలాగే డ్రైన్లు, ఇతర వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు. గత వైకాపా పాలనలో కుప్పం డిపోలోని బస్సులను పుంగనూరుకు తరలించుకున్నారని మరలా చంద్రబాబునాయుడు సిఎం కాగానే ఇతర ప్రాంతాలకు వెళ్లిన బస్సులు మరలా కుప్పం డిపోకు చేరుకున్నాయన్నారు. అవసరమైన ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులు నడిపేలా చర్యలు తీసుకుంటామన్నారు. అమరావతి కాలనీలో నిర్మాణంలో ఉన్న శ్రీ సత్యనారాయణస్వామి ఆలయానికి మరికొంత స్థలం కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో తెదేపా ఇన్‌చార్జ్ పిఎస్ మునిరత్నం, కమీషనర్ శ్రీనివాసరావు, రాష్ట్ర నేత డా॥బిఆర్ సురేష్‌బాబు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, మాజీ ఎఎంసి ఛైర్మన్ సత్యేంద్రశేఖర్, మాజీ సర్పంచ్ డికెపల్లి మణి, జనసేన డా॥ నరేష్, బిజెపి శివశంకర్, సోమశేఖర్, నబీఉల్లా, గనిఉల్లా తదితరులు పాల్గొన్నారు.

## చిత్తూరు పార్లమెంటు రూపురేఖలు మార్చుతా : ఎంపీ దగ్గుమళ్ళ



చిత్తూరు, ఆగస్టు 22 ప్రభాతవార్త: ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు సహకారంతో చిత్తూరు పార్లమెంటు రూపురేఖలు మార్చడానికి కంకణం కట్టుకుని పని చేస్తానని ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు పేర్కొన్నారు. రాష్ట్ర పురోగతి కోసం సిఎం నారా చంద్రబాబునాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్‌ల ఆధ్వర్యంలో ముందుకు సాగుతున్న పరిణామాలపై ఎంపీ దగ్గుమళ్ళ ప్రసాదరావు గురువారం స్పందించారు. ప్రపంచంను ఆకర్షించే విధంగా రాష్ట్ర రాజధాని అమరావతిని తీర్చిదిద్దడమే లక్ష్యంగా సిఎం నారా చంద్రబాబునాయుడు శ్రమిస్తున్నారన్నారు. అలాగే ప్రజా సంక్షేమానికి తొలి ప్రాధాన్యత ఇచ్చి సిఎం ముందుచూపుతో వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్రానికి సిఎం చంద్రబాబు నాయుడు పెట్టుబడులను తీసుకురావడంలో సఫలీకృతుడయ్యారన్నారు. చిత్తూరు పార్లమెంటు అభివృద్ధికి సంబంధించి ఎన్నికల సమయంలో తాను గుర్తించిన సమస్యలన్నింటినీ ఇటు రాష్ట్ర, అటు కేంద్ర ప్రభుత్వంకు విన్నవించడం జరిగిందన్నారు. సిఎం చంద్రబాబునాయుడు చిత్తూరు పార్లమెంటు అభివృద్ధి విషయంలో ఎక్కడా రాజీ పడకుండా ముందుకు వెళ్ళాలని తనను ప్రోత్సహిస్తున్నారన్నారు. చిత్తూరు జిల్లాలో మామిడి రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారంకు ముందడుగు వేయడంతో పాటు రైల్వే స్టేషన్ల ఆధునీకరణ, రైళ్ళ రాకపోకలకు సంబంధించి కేంద్ర మంత్రులకు వినతిపత్రాలు ఇవ్వడం జరిగిందన్నారు. చిత్తూరు పార్లమెంటు పరిధిలో నిరుద్యోగ సమస్యను పరిష్కరించడానికి ఎంఎస్ఎంఇలను నెలకొల్పే దిశగా ప్రయత్నాలు చేస్తున్నానన్నారు.

## శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ బదిలీ

**-కొత్త కమిషనర్ చరణ్‌రాజ్!?**



శ్రీకాళహస్తి,ఆగస్టు 22 ప్రభాతవార్త : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వం 24 మంది మున్సిపల్ కమిషనర్లను బదిలి చేసింది. వారిలో శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ ఎం.రమేష్‌బాబును గుంటూరుజిల్లా పొన్నూరుకు బదిలి చేసారు.శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్‌గా తిరుపతిలో అడిట్ విభాగంలో ఉన్న చరణ్‌రాజ్‌ను నియమించినట్లు సమాచారం.అయితే ఈ సమాచారం అధికారికంగా వెలువడ లేదు.రమేష్‌బాబు శ్రీకాళ హస్తి పుణ్యక్షేత్రంలో సుమారు నాలుగుసంవత్సరాలు పనిచేసారు.2019కి ముందు ఇక్కడ మూడు సంవత్సరాల పాటు పని చేసిన ఆయన పాలనలో మున్సిపాలిటి అభివృద్ధి పథంలో నడిచింది, ఆయన హయంలో అప్పటి శాసనసభ్యుడుగా ఉన్న బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సాధించిన పథకాలను సమర్థవంతంగా అమలు చేయటంలో రమేష్‌బాబు మ ంచిపేరు సంపాదించారు. అలాగే అమృత పథకంలో నిధులు సాధించి స్వర్ణముఖిలో పారిశుద్ధ్యం, అయ్యల నాడుచెరువులో వాకింగ్ ట్రాక్‌తో పాటు బోట్ క్లబ్ ఏర్పాటుకు రూ.75లక్షలు కేటాయించారు. అయితే ఇక్కడ నీరు మళ్ళించటానికే సరిపోదనే భావంతో నిధులులాప్స్ కాకుండా ఆ నిధులతో మున్సిపాలిటి ఆవరణలో సద్వినియోగం చేసారు.అలాగే 'టిడ్కో' గృహల అమలుకు కృషి చేసారు. కాగా సమన్వయంతో పని చేసారు. తరువాత రెండు సంవత్సరాల క్రితం ఇక్కడ కమిషనర్‌గా బాధ్యతలుచేపట్టారు. శివరాత్రుల సమయంలో సమర్థవంతంగా శానిటేషన్‌తో పాటు ప్లాస్టిక్ రహిత పట్టణంగా తీర్చి దిద్దుటకు కృషి చేసారు. నిధుల సద్వినియోగంలో ఆయన ఎంతో పకడ్బందీగా ప్రణాళికలు రూపొందించుకొని అమలు చేసారు.జనరల్ ఫండ్‌తో అభివృద్ధి పనులు చేపట్టారు. ఆయన బదిలీతోపాటు ఇక్కడ కమిషనర్‌గా తిరుపతి జిల్లా కలెక్టరేట్‌లో పనిచేస్తున్న చరణ్‌రాజ్‌కు అవకాశం ఉన్నట్లు చర్చించుకుంటున్నారు.

## మెగాస్టార్‌కు శివయ్య ప్రసాదాలు



శ్రీకాళహస్తి, ఆగస్టు 22 ప్రభాతవార్త : మెగాస్టార్, పద్మవిభూషణ్ అవార్డు గ్రహీత స్వయంకృషితో స్వశక్తితో ఎదిగిన ప్రముఖ నటుడు మెగాస్టార్ కొణిదెల చిరంజీవి పుట్టిరోజు సందర్బంగా ఆయన తిరుమల దర్శనానికి విచ్చేసిన విషయం తెలిసిందే. ఈనేపద్యంలో ఆయన్ను రాష్ట్ర బిజెపి కార్యదర్శి కోలా ఆనంద్ కుమార్ మర్యాదపూర్వకంగా కలసి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం ఆయనకు శ్రీకాళహస్తీశ్వరస్వామిఅమ్మవార్ల చిత్రపటంతో పాటు తీర్థప్రసాదాలను అందించారు.

## బదిలీల హడావుడి... అయోమంలో అధికారులు

కోట,ఆగస్టు 22 ప్రభాతవార్త : కోట మండల పరిషత్‌లో బదిలీ సందడి మొదలైంది. ఈ నెల చివరిలోగా ఉద్యోగులు బదిలీల పూర్తి చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి విధితమే.ఈ నేపథ్యంలో జడ్పీ అధికారులు ఈ విషయంపై దృష్టి కేంద్రీకరించారు. బదిలీల కావాలని కోరుకునే వారు అప్పుడే దరఖాస్తు చేసుకుంటున్నారు. ఏకంగా ఎమ్మెల్యే సిఫార్సులు లేఖలు సమర్పించడానికి సిద్ధమయ్యారు.ప్రభుత్వం జీఓ విడుదల చేసింది. ..కానీ బదిలీలకు సంబంధించి మార్గదర్శకాలు ఇంకా జారీ చేయలేదు. ఉద్యోగులు ఇంకా అయోమయంలో ఉన్నారు. ఐదేళ్ల స్వరీసు ఒకే చోట పూర్తి చేసిన వారికి బదిలీ తప్పనిసరి చేయడంతో ఇక్కడ పనిచేస్తున్న ఎంపిడివె మారెళ్ల భవాని కి కూడా బదిలీ తప్పటట్లు లేదు. దీంతో ఆమె రాపూరు, పొదలకూరు మండలాలకు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఆర్‌డబ్ల్యుఎస్,ఎఇ,హేమంత్ కుమార్, పంచాయరాజ్ ఎఇ కిరణ్‌కుమార్‌ల కూడా బదిలీకాక తప్పదు. అయితే వీరి బదిలీలకు రాజకీయం జోక్యం వస్తే బదిలీల ఆగవచ్చునుని తెలుస్తుంది.బదిలీల నేపథ్యంలో అధికారులు ఈనెల 23 నుంచి జరిగే గ్రామ సభల్లో మనస్సు పెట్టే పని చేసేలాల కనబటం లేదు.

## వరదయ్యపాళెం ఎఎస్ఐ సస్పెన్షన్

వరదయ్యపాళెం,ఆగస్టు 22 ప్రభాతవార్త : విధుల నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన వరదయ్యపాళెం ఎఎస్ఐ షణ్ముంగా రెడ్డిని సస్పెండ్‌చేస్తూ జిల్లా ఎస్పి ఎల్.సుబ్బరాయుడు చర్యలు తీసుకున్నారు. ఎస్పి మాట్లాడుతూ పోలీసుశాఖలో క్రమశిక్షణ, జవాబుదారి తనం చాలా ముఖ్యమని అది లోపిస్తే కఠిన చర్యలు తీసుకుంటున్నట్లు ప్రకటించారు. వరదయ్యపాళెం ఎఎస్ఐ విధి నిర్వహణలో అతసత్వాన్ని,నిర్లక్ష్యం ధోరణి ప్రదర్శించిన నేపథ్యంలో సస్పెన్షన్ చేసినట్లు తెలిపారు. వరదయ్యపాళెం పోలీసుస్టేషన్ ఇన్‌చార్జిగా విధులు నిర్వహిస్తున్న ఎఎస్ఐ షణ్ముగం ఆదివారం రాత్రి గొడవలతో రక్తగాయంతో స్టేషన్‌కు వచ్చిన వ్యక్తిని విచారించి తగు చర్యలు తీసుకోవటంలో విఫలమైన కారణంగా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీసే ప్రవర్తనను సహించేది లేదని ఎస్పి తెలిపారు.ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఎస్పి ఇలా తెలిపారు. ఆదివారంరాత్రి 11 గంటలకు ఇందిరా నగర్‌కు చెందిన ఇరువురు గాయపడ్డారు. డ్యూటీలో ఉన్న పిసి ఎఎస్ఐ షణ్ముగం ఫోన్‌ద్వారా సమాచారం అందించారు.అయితే ఆ సమయంలో ఎఎస్ఐ నిర్లక్ష్యంగా వ్యవహరించారు. దాంతో ఆయన అలసత్వంకు సంబంధించి ఎస్పి ఫిర్యాదుచేసారు. బాధ్యతా రాహిత్యంగా వ్యవహరించినందున సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించారు.




గురువారం అదనపు ఎస్పీలకు ఆత్మీయ వీడ్కోలు పలికిన పోలీసు అధికారులు - ప్రభాతవార్త, తిరుపతి

## ఎర్రచందనం స్మగ్లరు అరెస్టు

**13 ఎర్రచందనం దుంగలు, మోటారు సైకిల్ స్వాధీనం**

తిరుపతి కార్పొరేషన్, ఆగస్టు 22 ప్రభాతవార్త : సానిపాయ అటవీ ప్రాంతంలో ఒక ఎర్రచందనం స్మగ్లరును అరెస్టు చేయడంతో పాటు వారి నుంచి 13 ఎర్రచందనం దుంగలు, ఒక మోటారు సైకిల్‌ను టాస్క్‌ఫోర్సు ఇన్చార్జి, తిరుపతి జిల్లా ఎస్పి ఎల్ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు, టాస్క్‌ఫోర్సు ఎస్పి కె. శ్రీనివాస్ నేతృత్వంలో సానిపాయ బేస్ క్యాంపు నుంచి ఆర్ఎస్ఐ మురళీధర్ రెడ్డి బుధవారం కూంబింగ్ చేపట్టారు. వీరు ఎద్దుల కోన రాస్తా మీదుగా కొండూరు గ్రామం చేరుకుని, చిట్వేల్ రేంజి పెంగలూరు మండలం అటవీ ప్రాంతంలోకి వెళ్లారు. గురువారం తెల్లవారు జామున చక్రంపేట వద్ద ముగ్గురు వ్యక్తులు మోటారు సైకిల్ మీద కూర్చుని మాట్లాడుకుంటూ కనిపించారు. వీరిని సమీపించే చుట్టుముట్టే సరికి ఇద్దరు తప్పించుకుని పారిపోయారు. ఒక్కరిని పట్టుకోగలిగారు. ఇతనిని కోడూరు టౌన్ పగడాలపల్లికి చెందిన తుపాకుల హరినాథ్ (37)గా గుర్తించారు. ఇతన్ని విచారించగా దాచి ఉంచిన 13 ఎర్రచందనం దుంగలను చూపించాడు. వాటితో పాటు మోటారు సైకిల్‌ను స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్సు పోలీసులు తిరుపతి టాస్క్‌ఫోర్సు పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ కేసును సిఐ సురేష్ కుమార్ నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. పారిపోయిన వారి కోసం గాలిస్తున్నారు.

## కారడవిలోనూ... షికారీ కుటుంబాలపై దౌర్జన్యం

**-పోలీసులకు ఫిర్యాదు చేసిన షికారీలు**



పుంగనూరు,ఆగస్టు 22 ప్రభాతవార్త : ఎపుడో యాభై ఏళ్ళక్రితం కొండ కోనల్లో తిరుగుతున్న షికారీలను పిలిచి ప్రభుత్వం వారి కుటుంబాలు సేద్యం చేసుకుని జీవించడానికి షికారీపాలెంవద్ద భూములు కేటాయించారు. ఈక్రమంలో ఈభూముల పక్కన కొన్ని భూములను కలిగిన అక్కడి రెడ్డి సామాజిక వర్గానికి చెందిన నాయకులు పదేళ్ళగా షికారీల భూములపై దౌర్జన్యంగా ఆక్రమణ పర్వం మొదలుపెట్టారు. షికారీల భూములను ఎంతగా ఆక్రమించారంటే..చివరికి షికారీలు తాము వేసుకున్న పంటల భూములకు వెళ్లడానికి కూడా స్థలం లేకుండా మూసివేశారు. పూసలమ్ముకుని జీవించే షికారీలు జీవితాలు బాగుచేసుకునేందుకు వ్యవసాయంచేసుకుంటే చూడలేక పోవడంతో పాటూ వారి భూములపై పెత్తనం సాగించడం, బెదిరించడం, దౌర్జన్యం చేయడం సాగిస్తున్నారు. ఈనేపథ్యంలో స్వతహాగా తెలుగుదేశం పార్టీ అభిమానులైన ఈఊరి ప్రజలు ఇటీవల చల్లాబాబుకు ఘన స్వాగతం పలకడం, తెలుగుదేశం చురుకుగా ఉండడంతో పెత్తందార్లు సహించ లేకున్నారు. అడపా దడపా షికారీలను వెంటాడుతూనే ఉన్నారు. ఈనేపథ్య ంలో పుంగనూరు సిఐ శ్రీనివాసులును కలసి తమకు చెందిన భూములలో వెళ్లనీయక పెత్తందార్లు అడ్డుకుంటున్నారని, తమకు న్యాయం చేయాలని షికారీల నాయకులు అంకయ్య,రాణీబాబూలు సిఐ శ్రీనివాసులు, తహసీల్దార్‌లకు ఫిర్యాదుచేశారు. ఈభూముల సర్వేనిర్వహించాలని తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు మాధవరెడ్డి కోరారు. అయితే,సిఐకు ఫిర్యాదుచేసి కొని ్న గంటల వ్యవధిలోనే రాణీబాబు అనే షికారీను మార్గ మధ్యంలో పెత్తందార్ల వర్గీయులు అడ్డగించి దాడిచేసేందుకు యత్నించి,ఎలా బతకతారో చూస్తామంటూ హెచ్చరించారని ఆవేదన చెందారు.

## శ్రీసిటీ -ఎన్ఎస్ ఇన్‌స్ట్రూమెంట్స్ పరిశ్రమ వితరణ

**-గొల్లవారిపాలెంలో నూతన అంగన్‌వాడి భవనం ప్రారంభం**

సత్యవేడు,ఆగస్టు 22,ప్రభాతవార్త: శ్రీసిటీ పరిధిలోని గొల్లవారిపాలెం గ్రామంలో నిర్మించిన నూతన అంగన్‌వాడి భవనాన్ని ఎన్ఎస్ ఇన్‌స్ట్రూమెంట్స్ ఇండియా పరిశ్రమ ఎండీ హాజీమే కజోకా గురువారం ప్రారంభించారు. శ్రీసిటీ ఫౌండేషన్ చొరవతో శ్రీసిటీలోని జపాన్‌కు చెందిన ఆటోమొబైల్ పరికరాల తయారీ సంస్థ ఎన్ఎస్ ఇన్‌స్ట్రూమెంట్స్ ఇండియా తమ కార్పొరేట్ సామాజిక భాధ్యత కార్యక్రమం ద్వారా రూ॥35లక్షల వ్యయంతో దీనిని నిర్మించారు.భవనంతో పాటు మరుగుదొడ్లు, ప్రహరీగోడ, పర్నీచర్స్, టీవి, ఆట వస్తువులను ఏర్పాటు చేశారు.






ఇందుకు అవసరమైన భూమిని శ్రీసిటీ విరాళంగా అందజేసింది. ఈకార్యక్రమంలో ఎన్ఎస్ ఇన్‌స్ట్రూమెంట్స్ అసిస్టెంట్ మేనేజింగ్ డైరెక్టర్ తకావో ఇకరాషి, సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లు సంజయ్ ఆనంద్, మల్లేశ్వరన్, సాయికృష్ణ, శ్రీసిటీ వైస్ ప్రెసిడెంట్ రమేష్ కుమార్, సెక్యూరిటీ ప్రతినిధి రమేష్, శ్రీసిటీ ఫౌండేషన్ మేనేజర్ సురేంద్ర కుమార్, గ్రామ సర్పంచ్‌పార్వతి సన్యాసయ్య పాల్గొన్నారు. హాజీమే కజోకా మాట్లాడుతూ ఈ ప్రాంతం లోని ప్రభుత్వ విద్యా వైద్య సంస్థల మౌళిక సదుపాయాలను మెరుగు పరచడంలో సంస్థ నిబద్ధతను పునరుద్ఘాటించారు. ముున్ముందు మరిన్ని కార్యక్రమాలు చేపడతామని చెప్పారు.

## అభివృద్ధి పనులు గుర్తించేందుకే గ్రామసభలు

**- మండల పరిషత్ విస్తరణాధికారి మనోహర్ గౌడ్**

చిట్టమూరు, ఆగస్టు 22 ప్రభాతవార్త : రాష్ట్రప్రభుత్వం ఆదేశాల మేరకు ఆయా గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టబోయే అభివృద్ధి పనులకు ప్రతిపాదనలు సిద్ధం చేసేందుకే గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు మండల అభివృద్ధి విస్తరణాధికారి మనోహర్‌గౌడ్ తెలిపారు. శుక్రవారం చిట్టమూరు మండల పరిధిలోని 23 గ్రామ పంచాయతీల్లో గ్రామ సభలు జరుగుగతాయని ఆయన అన్నారు. ఆయా గ్రామ పంచాయతీల కార్యదర్శులు, సర్పంచుల పర్యవేక్షణలో నిర్దేశించిన ప్రాంతంలో గ్రామసభలకు కేటాయించిన ప్రత్యేక అధికారి సమక్షంలో నిర్వహిస్తారని తెలిపారు. ఆయా పంచాయతీల్లో నిర్వహించే గ్రామసభల్లో ప్రధానంగా ఉపాధి హామీ పనుల్లో పాల్గొన్న ప్రతి కూలీకి వారి విధులు, హక్కులు, సౌకర్యాల గురించి తెలియజేయాలన్నారు. ఈ సభలో ఉపాధి హామీ కూలీలు, ప్రజాప్రతినిధులు పాల్గొని గ్రామ అభివృద్ధికి అవసరమైన పనులు చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేయడానికి వారి వారి అభిప్రాయాలు తెలియజేయవచ్చని తెలిపారు. గ్రామ పంచాయతీల అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా తయారయింది. అయితే ప్రభుత్వం నిర్దేశించిన మేరకు ఒక్కో గ్రామసభ నిర్వహణకు ఖర్చవుతుందని గ్రామ సర్పంచులు చెబుతున్నారు. అయితే ఇవేమీ తమ బాధ్యత కాదన్నట్లుగా ప్రభుత్వం గ్రామసభల నిర్వహణకు నిధులు కేటాయించకపోవడంపై పలువురు సర్పంచులు, కార్యదర్శులు గగ్గోలు పెడుతున్నారు.

## పురుగుల మందు తాగి వ్యక్తి ఆత్మహత్య

కుప్పంరూరల్, ఆగస్టు 22 ప్రభాతవార్త

మతిస్థిమితం సరిగ్గా లేని ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న సంఘటన పైపాళ్యం పంచాయతీ చిన్నబొగ్గుపల్లిలో చోటు చేసుకుంది. స్థానికులు, పోలీసులు తెలిపిన మేరకు వివరాలిలా.. చిన్న బొగ్గుపల్లికి చెందిన సత్యవేలు (59) తన కుటుంబంతో కలసి జీవిస్తున్నాడు. ఇతనికి మతిస్థిమితం సరిగ్గా ఉండేదికాదన్నారు. ఈనేపథ్యంలో గురువారం పురుగుల మందు తాగి అపస్మారకస్థితికి చేరాడు. ఆస్పత్రికి తరలిస్తుండగా మృతి చెందాడు. మృతదేహానికి కుప్పం ఏరియా ఆస్పత్రిలో పంచనామా నిర్వహించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.




